మాజీ మంత్రి రఘుపతికి సీఎం చంద్రబాబు నివాళి

బెంగళూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మాజీ మంత్రి రఘుపతికి ఏపీ సీఎం చంద్రబాబునాయుడు నివాళి అర్పించారు. సోమవారం ఎం రఘుపతి 85వ జయంతిని పురస్కరించుకుని 'ఎక్స్'లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పోస్టింగ్ చేశారు. విద్యార్థి నాయకుడిగా రాజకీయ జీవితం ప్రారంభించి అంచెలంచెలుగా ఎదిగి ప్రజాసేవలో చెరగని ముద్ర వేశారన్నారు. పేదప్రజలకు ఆయన సేవలు చిరస్మరణీయమని, ఆదర్శవంతమైన ఆయన జీవితం ఎందరికీ ప్రేరణ కలిగిస్తుందని అభిప్రాయపడ్డారు. రఘుపతి మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నివాళి అర్పించారు.

అడుగడుగునా.. నిఘా



- రాష్ట్రంలో బంగ్లాదేశీయులపై ఆరా..
- జల్లెడ పడుతున్న కేంద్ర, రాష్ట్ర బలగాలు
- పోలీస్ స్టేషన్లలో సర్వేకు ఆదేశం
- కార్మికశాఖలో సమాచారానికై కసరత్తు
- కర్మాగారాల్లో ఉద్యోగుల జాబితా సేకరిస్తున్న అధికారులు



భవన నిర్మాణ పనుల్లో బంగ్లాదేశీ మహిళ (ఫైల్)

బెంగళూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్ పహల్గాంలో 26మంది పర్యాటకులను ఉగ్రవాదులు కిరాతకంగా హతమార్చడాన్ని ప్రపంచదేశాలు వ్యతిరేకించాయి. పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదుల చర్యను ప్రతిఘటిస్తూ దేశంలో నివసిస్తున్న పాకిస్థాన్ పౌరులను వెనక్కి పంపాలని కేంద్రం ఆదేశించింది. పలువురు పాకిస్థాన్ పౌరులను వాపసు పంపగా వివిధ కారణాలతో దేశంలో ఉండేవారిపైనా నిఘా పెంచారు. దీంతోపాటు దేశంలో అక్రమంగా నివసిస్తున్న బంగ్లాదేశీయుల జాడ కనిపెట్టేందుకు కార్యాచరణ సిద్ధమైంది. బంగ్లాదేశ్ ప్రజలు పలు నేరాల్లో ఇటీవల భాగస్వామ్యులవుతున్నట్లు కేసులు నమోదవుతున్నాయి. పగటి వేళల్లో చెత్త, పాతవస్తువుల సేకరించేవారిలా తిరిగి రాత్రి వేళల్లో దోపిడీలకు పాల్పడుతున్నారు. దొంగతనాలు, వేశ్యావాటిక, ఇతరత్రా నేరాలలో బంగ్లాదేశీయుల ప్రమేయం పలుసార్లు బయట పడింది. అయితే పహల్గాం సంఘటన తర్వాత బంగ్లాదేశీయుల కదలికలపై పోలీసులు కన్నేశారు.

పలు నేరాల్లో భాగస్వామ్యం..

పాకిస్థాన్ వాసుల తరహాలోనే బంగ్లాదేశ్ వాసులు కూడా ప్రమాదకరమని, అక్రమంగా దేశంలోకి చొరబడి ఇక్కడ నివసించేవారిపై పోలీసులు కొరడా ఝులిపిస్తున్నారు. వీరిని గుర్తించి దేశ సరిహద్దులు దాటించడమే పెను సవాల్‌గా ఉంది. బెంగళూరుతోపాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో స్థానికుల తరహాలో ఆధార్, పాన్, ఎన్నికల గుర్తింపు కార్డులను పొందుతున్నారు. కాఫీ, వక్క తోటలతోపాటు పలు పనుల్లో దినసరీ కూలీలుగా కొనసాగుతున్నారు. వీరిని గుర్తించేందుకు రాష్ట్ర పోలీసులు, కేంద్ర దర్యాప్తు సంస్థలు సంయుక్త కార్యాచరణకు సిద్ధమయ్యాయి. పాకిస్థాన్ ఉగ్రదాడి తర్వాత సైనికులు తీసుకుంటున్న చర్యలకు బంగ్లాదేశ్ కూడా భారత్‌కు వ్యతిరేక కలాపాలను ప్రారంభించింది. దీంతో ఆంతరంగిక భద్రతా విభాగం, రాష్ట్ర, కేంద్ర ఇంటెలిజెన్స్ విభాగాలు, స్థానిక పోలీస్ స్టేషన్‌ల పరిధిలో అక్రమంగా వలస ఉండే బంగ్లాదేశీయులను గుర్తించే ప్రక్రియ ప్రారంభించారు. విదేశీయులను గుర్తించే ప్రక్రియ ప్రారంభించాలని, నిఘా కొనసాగిస్తున్నారు.

గుర్తింపు నిరంతర ప్రక్రియ : కమిషనర్ దయానంద్

స్థానిక పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో బంగ్లాదేశ్ వాసుల గుర్తింపు నిరంతర ప్రక్రియగా కొనసాగుతోంది. ప్రస్తుతం సోదాలు మరింత ముమ్మరం చేశాం. అక్రమ వలసదారులుగా నిర్ధారణ అయితే చట్టప్రకారం వెనక్కి పంపుతాం. స్థానికంగా ఎవరికైనా అనుమానం ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి.

గుర్తింపు కార్డుల తనిఖీ..

బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడి నేపథ్యంలో కేంద్రప్రభుత్వ సూచనలకు అనుగుణంగా బంగ్లాదేశ్ ప్రజలను గుర్తించే ప్రక్రియ ప్రారంభమైంది. వివిధ కేసుల్లో ఇప్పటికే పట్టుబడినవారి నుంచి మిగిలినవారి సమాచారం సేకరించాలని నిర్ణయించారు. అయితే ఎక్కువమంది పలు గుర్తింపుకార్డులు కొన్నేళ్లకిందటే పొంది ఉండడంతో వారి మూలాలు సేకరించడం అధికారులకు సవాల్‌గా మారుతోంది. కేంద్ర ఇంటెలిజెన్స్ విభాగం సూచనతో బెంగళూరుతోపాటు అన్ని జిల్లాల పోలీస్‌స్టేషన్‌ల పరిధిలోనూ కూలీలు, డ్రైవర్‌లుగా కొనసాగుతున్న పశ్చిమబెంగాల్, జమ్ము- కశ్మీర్, ఒడిశా, పంజాబ్‌తోపాటు ఉత్తర ఈశాన్య రాష్ట్రాల వ్యక్తులుగా ఆధార్, పాన్ కార్డులతోపాటు బ్యాంకు వివరాలు సేకరిస్తున్నారు.

పలురంగాల ముఖ్యులతో సమావేశాలు..

చిక్కమగళూరు, శివమొగ్గ, ఉడుపి, మంగళూరుతోపాటు తీర ప్రాంత జిల్లాల్లో భవన నిర్మాణ కాంట్రాక్టర్లతోపాటు బెంగళూరులో గుజరీ కొనుగోలు చేసే వ్యాపారులతో సమావేశం కావాలని అధికారులు నిర్ణయిచాఆరు. ప్రధానంగా మలెనాడు, తీరప్రాంత జిల్లాల్లో కాఫీ, వక్కతోటల్లో అధికంగా పనిచేస్తున్నట్లు తెలుస్తోంది. కార్మికులను నియమించుకునేందుకు వారి గుర్తింపుకార్డుల పరిశీలన, ఇతరత్రా వివరాలు సమగ్రంగా సేకరించాలని కాఫీ తోటల యజమానులకు, కాంట్రాక్టర్‌లకు నోటీసులు ఇవ్వాలని అధికారులు నిర్ణయించారు. పోలీసుల సమాచారం ప్రకారం రాష్ట్రంలో 6వేల మందికిపైగా బంగ్లాదేశీయులు ఉన్నట్లు అంచనా. పశ్చిమబెంగాల్ ద్వారా అక్రమంగా దేశంలోకి వచ్చి తొలుత రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో కొన్ని నెలలపాటు గడిపి, ఆ తర్వాత బెంగళూరు సహా వివిధ ప్రాంతాల్లో పనుల్లోకి చేరుతున్నట్లు తెలుస్తోంది. జాతీయ గుర్తింపు కార్డులు పాన్, ఆధార్‌లను సులభతరంగా పొందుతున్నట్లు తెలుస్తోంది. బెంగళూరులో కనీసం రెండున్నరవేలమంది దాకా ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. వారికి ఓటరు గుర్తింపు కార్డులు చేయించడంలోనూ స్థానిక నాయకులు కీలకంగా వ్యవహరించారనే ఆరోపణలు వచ్చాయి.

- ఆరేడేళ్లుగా బెంగళూరు, బెంగళూరు గ్రామీణ, రామనగర ప్రాంతాల్లో బంగ్లాదేశ్‌కు చెందిన జమాత్ ముజాహిద్దీన్ బంగ్లాదేశ్ (జేఎంబీ) ఉగ్రవాదులు 8మందిని ఎన్ఐఏ అధికారులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. వీరు నగరంలో దోపిడీలకు పాల్పడి ఆ సొమ్మును బంగ్లాదేశ్‌లో ఉగ్రవాద సంస్థ కలాపాలకు పంపేవారని గుర్తించారు. వీరు పదేళ్లకిందటే బెంగళూరుకు వచ్చి ఇక్కడే నివసిస్తూ వివిధ పనులు చేస్తున్నట్లు దర్యాప్తులో తేలింది. రాష్ట్రంలో వివిధ జిల్లాల్లో బంగ్లాదేశీయులను గుర్తించారు. వీరిలో కేజీఎఫ్ 4, మంగళూరు 2, రామనగర 11, విజయపుర 33, దక్షిణకన్నడ 15, మైసూరు 27, ఉడుపి 10, రాయచూరు 1, హాసన్ 3, చిత్రదుర్గ 4, బెంగళూరు జిల్లా 36, శివమొగ్గ 6, మండ్య 15, బెంగళూరు 321మందితో కలిపి 488మందిని గుర్తించారు. వీరిలో 210మందిని అంచెలంచెలుగా రెండున్నరేళ్ల వ్యవధిలో సరిహద్దులు దాటించారు. మిగిలినవారిని విదేశీ నిరాశ్రయుల కేంద్రంలో ఉంచారు. వీరిపై 138 కేసులు ఉన్నాయి.

యాదగిరి కెమికల్ ఫ్యాక్టరీలో బంగ్లావాసులు

యాదగిరి జిల్లా కడేచూరు బాడియాల పారిశ్రామికవాడలో సుమారు 20మందికి పైగా కెమికల్ ఫ్యాక్టరీల్లో బంగ్లాదేశ్ వాసులు పనిచేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రమాదకరమైన ఫ్యాక్టరీల్లో పనిచేసేందుకు స్థానికులు వెనుకడుగు వేస్తున్నారు. దీంతో ఏజెన్సీల ద్వారా వివిధ రాష్ట్రాలనుంచి కార్మికులను రప్పిస్తున్నారు. వీరిలో బంగ్లాదేశ్ వాసులు కూడా అనుమానాలు ఉన్నాయి. కెమికల్ రవాణా విషయంలో బంగ్లాదేశ్ వాసులు ధైర్యంగా పనిచేస్తున్నారని తెలుస్తోంది.

మృతిచెందినవారి పేర్లమీదే..
52 లక్షల భూముల ఖాతాలు

- హక్కులు కోల్పోతున్న వారసులు
- సమస్యల పరిష్కారానికి త్వరలో ప్రత్యేక అభియాన
- రెవెన్యూశాఖ మంత్రి కృష్ణబైరేగౌడ



బెంగళూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొన్నేళ్లకాలంగా భూముల ఖాతాల మార్పిడి జరగలేదని ఇప్పటికీ మృతి చెందిన 52లక్షలమంది పేరిట భూముల రికార్డులు ఉన్నాయని రెవెన్యూశాఖ మంత్రి కృష్ణబైరేగౌడ తెలిపారు. బెంగళూరులో సోమవారం మీడియాతో మాట్లాడిన ఆయన యాజమాన్యపు హక్కులు పొందేందుకు వారసులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ప్రభుత్వ సౌకర్యాలు పొందలేకపోతున్నారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వారసులకు భూముల ఖాతాల అభియాన ప్రారంభించేందుకు కసరత్తు జరుపుతోందన్నారు. 52లక్షల భూముల ఖాతాలు మృతి చెందినవారిపేరిటే ఉన్నాయన్నారు. వాటిని వారసుల పేరిట మార్పు చేయాల్సి ఉందన్నారు. భూయజమాని మృతి చెందాక వారసుదారులు, కుటుంబీకుల పేరిట మార్పు చేసుకోనటువంటి వాటిని 'పౌతి ఖాతా'గా పిలుస్తారన్నారు. రెండు మూడు తరాలు మారినా ఇంకా కొన్ని ఆస్తులు అలాగే ఉన్నాయన్నారు. యజమాని మృతి చెందిన భూమిని మార్పు చేసుకోకపోతే ప్రకృతి వైపరీత్యనష్టాలతోపాటు ఇతరత్రా ప్రభుత్వ పరిహారాలు పొందడం సాధ్యం కాదన్నారు. రాష్ట్రంలో 4.11 కోట్ల భూముల యజమానులు ఉండగా వీరిలో 3.5 కోట్ల భూ యజమానుల ఆస్తులకు ఆధార్ అనుసంధానం చేశామన్నారు. 51.13 లక్షలమంది భూయజమానులు మృతి చెందారన్నారు. 2.21 కోట్ల భూములకు ఇ-కేవైసీ చేశామన్నారు. 70లక్షలమంది భూములు వ్యవసాయేతర అవసరాలకు ఉపయోగిస్తున్నారన్నారు. కోర్టులలో ఉండే వివాదాలతోపాటు ఇతరత్రా ఖాతాలకు సమగ్ర ఆధారాలు సేకరించి విబేధాలు లేకుండా వారసులు ఖాతాలు చేసుకోవాలన్నారు.

గొంతుకోసినా పార్టీ మారను

- కొత్త పార్టీ ఆలోచన లేదు
- మాజీ డీసీఎం ఈశ్వరప్ప



బెంగళూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): గొంతు కోసినా పార్టీ మారేది లేదని... కొత్త పార్టీ ఏర్పాటు చేయాలన్న ఆలోచన లేదని మాజీ డీసీఎం, ఒకప్పటి బీజేపీ ముఖ్య నాయకుడు ఈశ్వరప్ప తేల్చి చెప్పారు. విజయపురలో సోమవారం మీడియాతో మాట్లాడిన ఆయన వేటుకు గురైన ఎమ్మెల్యే యత్నాళ్‌తో కలసి కొత్త పార్టీ ఏర్పాటు చేస్తారా..? అనే ప్రశ్నకు సమాధానంగా ఎప్పటికీ వేరే పార్టీకి వెళ్లనని, కొత్త పార్టీ తానెందుకు పెడతానన్నారు. యత్నాళ్ రాజకీయ పార్టీ ఏర్పాటు విషయం తెలియదన్నారు. సరిహద్దుల్లో యుద్ధ వాతావరణం వచ్చేందుకు పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదులే కారణమన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సూచించినా కదన విరామాన్ని కేవలం మూడు గంటల్లోనే పాకిస్థాన్ ఉల్లంఘించిందన్నారు. పాకిస్థాన్‌లో నీరు, ఆహారం లేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇదే తరహాలో కొనసాగితే భవిష్యత్తులో ప్రపంచపటంలో పాకిస్థాన్ ఉండదన్నారు.

చిత్రదుర్గలో రోడ్డు ప్రమాదం

- ముగ్గురు గుంటూరు జిల్లావాసుల దుర్మరణం



ప్రమాదానికి కారణమైన లారీ

బెంగళూరు, మే 12(ఆంధ్రజ్యోతి): చిత్రదుర్గ నుంచి హొళల్కెరె వైపు వెళ్తున్న ఇన్నోవా కారును సోమవారం తెల్లవారుజామున ఎదురుగా వచ్చిన లారీ ఢీ కొట్టడంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు జిల్లా వెంకటాపురానికి చెందిన ముగ్గురు దుర్మరణం చెందారు. సునీత (34), శ్యాంబాబు (17), శివనాగలి (55) మృతి చెందిన వారిలో ఉన్నారు. వీరు గుంటూరు నుంచి శివమొగ్గకు వెళ్తుండగా ప్రమాదం జరిగింది. ప్రమాదంలో కారు నుజ్జునుజ్జయింది. ప్రమాదంపై హొళల్కెరె పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు.

నిర్లక్ష్యానికి..
మందేది..?

- ఔషధ మొక్కల సంరక్షణ కేంద్రాన్ని పట్టించుకునే వారు కరువు
- ఎండిపోతున్న దుస్థితి
- రూ.లక్షల నిధులు వృథా

బళ్లారి, మే 12(ఆంధ్రజ్యోతి): బళ్లారి జిల్లా సండూరు వద్ద ఉన్న స్వామి మలై అటవీ ప్రాంతంలో ఉన్న ఔషధ మొక్కల సంరక్షణ కేంద్రం నిర్లక్ష్యానికి గురవుతోంది. పోషణ లేకపోవడంతో పలు రకాల మొక్కలు వాడిపోతున్నాయి. సరైన నిర్వహణ లేని కారణంగా మొక్కలు జీవం కోల్పోయి ఎండిపోతున్నాయి. దీని కారణంగా భవిష్యత్తులో ఆయుర్వేద ఔషధాల తయారీకి కావాల్సిన మొక్కలు దొరక్క వైద్యం ప్రమాదంలో పడుతుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- బళ్లారి జిల్లా సండూరు సౌత్ ఫారెస్టు జోన్‌లోని బళ్లారి ప్రాంతీయ విభాగం లో 1999లో 345 వందల హెక్టార్లలో అటవీ ప్రాంతంలో ఔషధ మొక్కల సంరక్షణ కేంద్రం ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో మొత్తం 12 ఔషధ మొక్కల కేంద్రాలు ఉంటే బళ్లారి రెండవ అతిపెద్ద ఔషధ మొక్కల పెంపకం క్షేత్రం కావడం విశేషం.

290కి పైగా వివిధ రకాల ఔషధ మొక్కలు సండూరు క్షేత్రంలో ఉన్నాయి. వీటిలో ఇతర ప్రాంతాల్లో ఎక్కడా దొరకని ఔషధ గుణాలు కలిగిన సుమారు 50 రకాల ప్రత్యేక ఔషధ మొక్కల సంపద ఇక్కడ ఉన్నాయి. సంరక్షణ కరువై ధ్వానర్తరి. నంది దేవర, చరక్కమహాఋషి, రాశి, నవగ్రహ వనాలతో మొత్తం ఔషధ మొక్కలు ఎండిపోతున్నాయి. ఈ సంరక్షణ కేంద్రలో ఎర్రచందనం, మామిడి, బకుల, మర్రి, కక్కె, జలను మత్తుగ, అరళి, బీట్, బత్తి, ఉత్తరాణి, దర్భిహళ్ళ, మొక్కలు పెంచారు. ఇక్కడ ఉండే మొక్కలు ఎక్కువగా క్యాన్సర్, అల్సర్, దగ్గు, దృష్టి సమస్యలు, చర్మవ్యాధులు, సంతానోత్పత్తి, ఉబ్బసం, ఇలా అనేక వ్యాధులను నయం చేసే ఔషధ మొక్కలు ఇక్కడ ఉన్నాయి. ఈ మొక్కలకు అటవీశాఖ నిర్లక్ష్యంతో మొక్కలు ఎండిపోయాయి.

- 2022 లో జిల్లా మినరల్ ఫండ్ ఫౌండేషన్ పథకం ద్వార ఔషధ క్షేత్రంలో అభివృద్ధికి నిధులు విడుదల చేస్తామని ఎంపీ తుకారాం హామీ ఇచ్చినా అది అమలుకు నోచుకోలేదు. కేఎంఆర్‌సీ, ఇతర నిధులు ప్రభుత్వ ఖాతాల్లో మూలగుతున్న ఔషధ మొక్కల సంరక్షణ క్షేత్రంకు నిధులు ఇవ్వడంలో పెద్దగా శ్రద్ధచూపడం లేదు. రాష్ట్రంలో ఉన్న అనేక కళాశాలలో బీఏఎంఎస్ బ్యాచురల్ అఫ్ ఆయుర్వేదం మెడిసెన్ అండ్ సర్జన్ డాక్టర్ కోర్సులు చేస్తున్న విద్యార్థులు ఎంతో మంది ఇక్కడికి వచ్చి రోగనివారణ వాటి ఔషధం, అవసరమైన మొక్కల పరిశీలనకు ఏటా వస్తుంటారు. వీరితో పాటు పీజీ, స్పెషలైజేషన్ ఇన్ ఆయుర్వేద చేసే ఎంతో మంది శాస్త్రవేతలు ఇక్కడికి వచ్చి ఔషధ మొక్కలను పరిశీలిస్తున్నారు. వీటిలో కొన్ని ముఖ్యమైన మొక్కలు రక్షణ కరువై కనుమరుగైపోతున్నాయని వీరు అవేదన వ్యక్తం చేస్తున్నారు. కేఎంఆర్‌సీ, కేడీఎంఎస్, ఇతర కేంద్ర, అటవీ నిధులు లతో ఇక్కడ ఉన్న ఔషధ మొక్కల క్షేత్రాన్ని రక్షించాలని కోరుతున్నారు.



సండూరులోని ఔషధ మొక్కల సంరక్షణ కేంద్రం



కేంద్రం పరిసరాల్లో అపరిశుభ్రత

కేంద్ర జనాభా లెక్కలకు... రాష్ట్రానికి చెందిన యాప్..?

- జోరుగా సాగుతున్న ఎస్సీ వర్గీకరణ సర్వే

బెంగళూరు, మే 12(ఆంధ్రజ్యోతి): రాష్టంలో ఎస్సీ కుల వర్గీకరణ అమలు చేసేందుకు దేశంలోనే తొలిసారిగా మొబైల్ యాప్‌ను ఉపయోగిస్తున్నారు. వాటిలోనే ఎస్సీ కుటుంబాల వివరాలు, తెగలు, ఇతరత్రా వివరాలు నమోదు చేస్తున్నారు. వర్గీకరణ కోసం జరుగుతున్న సర్వే యాప్ సమాచారం ఇవ్వాలని కేంద్ర సామాజిక న్యాయ, స్వావలంబన మంత్రిత్వశాఖ రాష్ట్రప్రభుత్వానికి లేఖ రాసింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్రప్రభుత్వం జనగణనతోపాటు కుల గణన కూడా జరపాలని తీర్మానించారు. రాష్ట్రప్రభుత్వం మొబైల్ యాప్ ద్వారా ఎస్సీ కులాల సర్వేను అమలు చేస్తున్న వివరాలపై కేంద్రప్రభుత్వం ఆరా తీసింది. యాప్ వివరాలు, అమలు చేస్తున్న విధానంపై సమగ్ర సమాచారం ఇవ్వాలని రాష్ట్రప్రభుత్వానికి రాసిన లేఖలో ప్రస్తావించారు. కేంద్రం నుంచి ఈనెల 8న లేఖ పంపిన మేరకు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి 8 పేజీల సమగ్ర వివరాలతో నివేదికను పంపినట్లు తెలుస్తోంది. ప్రైవేట్ సంస్థలు మొబైల్ యాప్ ద్వారా పలు సర్వేలు జరిపాయి. అయితే ప్రభుత్వ వ్యవస్థలో మొబైల్ యాప్ ద్వారా కుటుంబాల వివరాలను సేకరిస్తున్నది తొలిసారి రాష్ట్రంలోనే. ఈ వ్యవస్థ ద్వారానే కేంద్రప్రభుత్వం దేశవ్యాప్తంగా జనగణన (జనాభా లెక్కల సేకరణ) చేపట్టనున్నట్లు తెలుస్తోంది. వర్గీకరణ కోసం ఈ నెల 5న సర్వే ప్రారంభం కాగా ఇప్పటివరకు 10.04 లక్షల కుటుంబాల వివరాలు సేకరించారు. సర్వే ఈనెల 17తో ముగియనుంది.





ప్రార్థనలు చేస్తున్న భక్తులు

రాష్ట్రవ్యాప్తంగా బుద్ధ జయంతి

8

వైభవం.. లక్ష్మీ రంగనాథ స్వామి
రథోత్సవం

రాయచూరు, మే 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని దేవదుర్గ తాలూకా మానసగల్ గ్రామంలో వెలసిన లక్ష్మీ రంగనాథ స్వామి రథోత్సవం సోమవారం రాత్రి అంగరంగా వైభవంగా నిర్వహించారు. ప్రతి ఏటా వైశాఖమాస శుద్ధ పౌర్ణమి నాడు నిర్వహించే స్వామి రథోత్సవాన్ని తిలకించేందుకు వేలాదిగా భక్తులు తరలి వచ్చారు. స్వామి వారి రథోత్సవం సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ప్రతి ఇంట్లోను మామిడి తోరణాలు అలంకరించి మహిళలు, పురుషులు, పిల్లలు నూతన వస్త్రాలు ధరించి సంబరంగా రథోత్సవంలో పాల్గొనడం విశేషం. రథోత్సవాన్ని తిలకించేందుకు ఏపీ, తెలంగాణ రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. కాగా లక్ష్మీరంగనాథస్వామి జాతర ఉత్సవాలు దాదాపు నెల రోజుల పాటు సాగుతాయని ఆలయ అర్చకులు తెలిపారు.



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు



117 రద్దు పేరుతో అశాస్త్రీయ నిర్ణయాలపై ఇటీవల అనంతపురం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

కొత్త స్కూళ్లు.. సరికొత్త సవాళ్లు..!

జీఓ 117 రద్దు తర్వాత ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

- రెండు నెలలుగా విద్యాశాఖ కసరత్తు
- చివరి దశకు స్కూళ్ల పునర్నిర్మాణం
- జిల్లాలో బేసిక్ ప్రైమరీ 621, మోడల్ ప్రైమరీ స్కూళ్లు 626..
- 338 వరకూ ఉన్నత పాఠశాలలు
- తగ్గనున్న యూపీ స్కూళ్లు
- ఉపాధ్యాయ వర్గాల్లో ఆందోళన
- పోరాటానికి పిలుపునిచ్చిన కొన్ని సంఘాలు

స్కూళ్ల స్వరూపం మారనుంది ఇలా..

నియోజకవర్గం	ఫౌండేషన్ స్కూళ్లు	బేసిక్ ప్రైమరీ	మోడల్ ప్రైమరీ	యూపీ స్కూళ్లు	హైస్కూళ్లు	మొత్తం
అనంతపురం	5	31	31	0	18	85
గుంతకల్లు	15	77	78	1	30	201
కళ్యాణదుర్గం	15	113	101	17	59	305
రాప్తాడు	10	53	33	1	23	120
రాయదుర్గం	3	60	156	3	74	296
శింగనమల	22	139	70	6	39	276
తాడిపత్రి	13	98	59	14	39	223
ఉరవకొండ	9	50	98	17	56	230
మొత్తం	92	621	626	59	338	1,736



స్కూళ్ల పునర్నిర్మాణంపై కసరత్తు చేస్తున్న విద్యాశాఖాధికారులు

అనంతపురం విద్య, మే 12(ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యాశాఖలో స్కూళ్లు కొత్తరూపు సంతరించుకోబోతున్నాయి. విద్యాశాఖలో గత ప్రభుత్వం తెచ్చిన 117 జీఓను రద్దు చేసి, ప్రత్యామ్నాయ ఏర్పాట్లకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా స్కూళ్ల పునర్నిర్మాణంపై దృష్టిపెట్టారు. రెండు నెలలుగా విద్యాశాఖాధికారులు ఇదే ప్రక్రియలో నిమగ్నమయ్యారు. ఉదయం నుంచి రాత్రి వరకూ సీనియారిటీ జాబితాల తయారీ, అభ్యంతరాల స్వీకరణ, వాటి పునఃరూపకల్పన ద్వారా స్కూళ్ల పునర్నిర్మాణంపై కసరత్తు చేస్తున్నారు. సెలవు రోజుల్లో సైతం ఇదే పనిలో నిమగ్నమవుతున్నారు. ఈ ప్రక్రియ అంతా కొలిక్కి వచ్చింది. స్కూళ్ల పునర్నిర్మాణ ప్రక్రియలో భాగంగా టీచర్లు ప్రధానంగా అనుమానం వ్యక్తం చేస్తున్న ప్రాథమికోన్నత పాఠశాలలు చాలావరకూ తగ్గనున్నాయి. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చెబుతున్న మోడల్ ప్రైమరీ స్కూళ్లు 626 వరకూ, బేసిక్ ప్రైమరీ స్కూళ్లు 621 వరకూ భారీగానే పురుడు పోసుకోనున్నాయి. హైస్కూళ్లు సైతం 338 వరకూ ఏర్పాటుకానున్నాయి. యూపీ స్కూళ్లు తగ్గనుండడంతో టీచర్లు నష్టపోతారంటూ ఆ సంఘాల నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొందరు సంఘాల నేతలు ఇప్పటికే ఉద్యమాలకు నడుం బిగించారు. దీంతో కొత్త స్కూళ్ల ఏర్పాటు... విద్యాశాఖలో సరికొత్త సవాళ్లు, సమస్యలకు వేదికగా మారబోతోంది.

జీఓ 117 ముందు పరిస్థితిని యథాతథంగా ఉంచాలి



117 జీఓతో స్కూళ్లు చాలా రకాలుగా నష్టపోయాయి. దానిని రద్దు చేస్తామంటూ కొత్త ప్రభుత్వం సైతం అశాస్త్రీయంగా ముందుకెళ్తుండడాన్ని టీచర్లు జీర్ణించుకోలేకపోతున్నారు. 117 జీఓ తేవడానికి ముందున్న ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ, హైస్కూళ్ల విధానాన్నే అమలు చేస్తే పిల్లలకు సౌకర్యవంతంగా ఉంటుంది. అలాకాకుండా కొత్త పేర్లు పెట్టి ఇష్టారాజ్యంగా వర్గీకరణ చేస్తే... అటు టీచర్లు, ఇటు విద్యార్థులకు తీరని నష్టం వాటిల్లుతుంది.

-జయరాంనాయక్, ఎన్టీఏ జిల్లా అధ్యక్షుడు

పోరాటానికి సిద్ధం

విద్యాశాఖ తీసుకుంటున్న నిర్ణయాలపై ఉపాధ్యాయ సంఘాల నేతలు పోరాటాలకు దిగనున్నారు. ప్రభుత్వ నిర్ణయాలతో యూపీ స్కూళ్లు చాలావరకూ తగ్గిపోయే ప్రమాదం ఉండటంతో సంఘాల నేతలు, టీచర్లు మండిపడుతున్నారు. అప్పర్ ప్రైమరీ స్కూళ్లను యథాతథంగా కొనసాగించాలని యూనియన్ నేతలు కోరుతున్నారు. ఆరు నుంచి పదో తరగతి వరకూగానీ, 6 నుంచి 12 వరకూ స్కూళ్లను యథాతథంగా నడపాలని కోరుతున్నారు. యూపీ స్కూళ్లలో 6, 7 తరగతులు ఉన్నచోట నాలుగు స్కూల్ అసిస్టెంట్లు, 6, 7, 8 క్లాసులు ఉన్నచోట ఆరు స్కూల్ అసిస్టెంట్లను కొనసాగించాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రైమరీ స్కూళ్లకు విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా రెండు ఎస్జీటీ పోస్టులను ఉంచాలని కోరుతున్నారు. ప్రతి హైస్కూల్‌లో విద్యార్థుల సంఖ్యతో నిమిత్తం లేకుండా హెచ్ఎం, పీడీ పోస్టులను కొనసాగించాలని కోరుతున్నారు. మోడల్ ప్రైమరీ స్కూళ్లకు పీఎస్ హెచ్ఎంలను కేటాయించాలని డిమాండ్ చేస్తున్నారు. మోడల్ ప్రైమరీ స్కూళ్లకు సబ్జెక్టు టీచర్లను సర్దడం సరికాదంటూ మండిపడుతన్నారు. ఎక్కువ రోల్ ఉన్న స్కూళ్లలో రెండు మాధ్యమాలు పెట్టాలని డిమాండ్ చేస్తున్నారు. ఉపాధ్యాయ సంఘాల నేతలు అనేక వినతులు, ప్రతిపాదనలు చేస్తున్నా.. విద్యాశాఖ నుంచీ ఆశించిన స్థాయిలో స్పందన లేకపోవడంతో వారు ధర్నాలకు సిద్ధమయ్యారు. ఏపీటీఎఫ్ దశలవారీ ఉద్యమం చేపట్టాలని నిర్ణయించింది. ఇతర సంఘాలు సైతం అదే బాట పట్టనున్నాయి.

స్కూల్ అసిస్టెంట్లను యూపీ స్కూళ్లలో ఉంచాలి



స్కూల్ అసిస్టెంట్లను మోడల్ ప్రైమరీ స్కూళ్లకు సర్దుబాటు చేయడం సబబుకాదు. సబ్జెక్టు టీచర్లను అప్పర్ ప్రైమరీ స్కూళ్లలోనే కొనసాగించాలి. స్కూల్ అసిస్టెంట్లు యూపీ స్కూళ్లలో ఉంటేనే బోధన సామర్థ్యాలు పెరుగుతాయి. ప్రతి మోడల్ ప్రైమరీ స్కూల్‌కు ఒక ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడి పోస్టు కేటాయించాలి. మిగిలిన పీఎస్ హెచ్ఎంలను ఎస్జీటీలకు ప్రమోషన్లు ఇవ్వాలి.

-నాగేంద్ర, యూటీఎఫ్ సీనియర్ నాయకుడు

అమర జవాన్‌కు రక్తదానంతో నివాళి

మేము సైతం అంటూ ముందుకు వచ్చిన దంపతులు



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, అడ్మినిస్ట్రేటర్ మల్లికార్జునరెడ్డి

అనంతపురం టౌన్, మే 12(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్‌లో అమరుడైన వీరజవాన్ మురళీనాయక్‌కు రక్తదానంతో అనంత ప్రజలు నివాళులర్పించారు. సోమవారం జిల్లా ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేసి నివాళులు అర్పించారు. శిబిరానికి అనూహ్య స్పందన వచ్చింది. తొలుత యుద్ధంలో మరణించిన వీరజవాన్ల చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రక్తదాన శిబిరాన్ని సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు ప్రారంభించారు. మేముసైతం అంటూ వైద్యులు, సిబ్బంది, సాధారణ జనం ముందుకొచ్చి రక్తదానం చేశారు. అనంతపురంరూరల్ మండలం కందుకూరు గ్రామానికి చెందిన రాధమ్మ, రాధాకృష్ణ దంపతులు రక్తదానం చేసి దేశభక్తిని చాటుకున్నారు. రక్తదానం చేయడం ఎంతో ఆనందంగా ఉందని వారు పేర్కొన్నారు. రక్తదానం చేసిన డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ హేమలత మాట్లాడుతూ.. మనకోసం ప్రాణాలు అర్పించిన వీరజవాన్‌లకు రక్తదానశిబిరంతో అశ్రునివాళులు అర్పించామని తెలిపారు. సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, ఆసుపత్రి అడ్మినిస్ట్రేటర్ మల్లికార్జునరెడ్డి, ఆర్ఎంఓ రామక్రిష్ణ, డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ హేమలత, డాక్టర్ పద్మజ శిబిరాన్ని పరిశీలించారు. రక్తదాతలకు ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో బ్లడ్‌బ్యాంకు హెచ్ఓడీ డాక్టర్ శివశంకరనాయక్‌తో పాటు పలువురు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

సార్..! స్నాతకోత్సవానికి రండి

గవర్నర్‌ను ఆహ్వానించిన వీసీ సుదర్శనరావు

అనంతపురం సెంట్రల్, మే 12(ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ 14వ స్నాతకోత్సవానికి రావాలంటూ రాష్ట్ర గవర్నర్ జస్టిస్ సయ్యద్ అబ్దుల్ నజీర్‌ను వీసీ సుదర్శనరావు, రిజిస్ట్రార్ క్రిష్ణయ్య ఆహ్వానించారు. ఈ మేరకు సోమవారం గవర్నర్‌ను కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈనెల 17న నిర్వహిస్తున్న స్నాతకోత్సవానికి రాష్ట్ర గవర్నర్ దంపతులతోపాటు, గవర్నర్ కార్యదర్శి ఐఏఎస్ హరిజవహర్ హాజరవుతారని వీసీ సుదర్శనరావు పేర్కొన్నారు.



గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు ఆహ్వానం అందజేస్తున్న వీసీ సుదర్శనరావు, రిజిస్ట్రార్ క్రిష్ణయ్య

అడుగంటుతున్న జలం

- ఎండిపోతున్న బోరుబావులు
- రూ. లక్షలు ఖర్చుచేసి తడులు
- పంటలను కాపాడుకునేందుకు రైతుల అవస్థలు



పచ్చారుమేకలపల్లి వద్ద ఎండిపోతున్న అరటి పంట



పచ్చారుమేకలపల్లి వద్ద ట్యాంకర్‌తో నిమ్మచెట్లకు నీరు పెడుతున్న రైతు

యాడికి, మే 12(ఆంధ్రజ్యోతి): వేసవి వచ్చిందంటే చాలు పండ్లతోటల రైతులు బెంబేలెత్తిపోతున్నారు. పంట రావడం అటుంచితే.. భూగర్భ జలాలు అడుగంటిపోయి చెట్లను కాపాడుకోవడానికి అనేక అవస్థలు పడుతున్నారు. మండలంలోని పచ్చారుమేకలపల్లి, కోనుప్పలపాడు, రాయలచెరువు, యాడికి, నగరూరు తదితర గ్రామాల్లో భూగర్భజలాలు అడుగంటాయి. దీంతో బోరుబావుల్లో నీళ్లు రోజురోజుకు తగ్గిపోతున్నాయి. పంటలను కాపాడుకోవడానికి రైతన్నలు భగీరథ ప్రయత్నాలు చేస్తున్నారు. చేతికి అంది వచ్చిన పంటలను కాపాడుకోలేక అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం బోరు వేయాలంటే కనీసం రూ.లక్షకు తక్కువ కాకుండా ఖర్చు అవుతుందని రైతులు చెబుతున్నారు. నీళ్లు పడకపోవడంతో పంట నష్టపోవడమే కాక బోరువేయడానికి అవుతున్న ఖర్చును అప్పులుగా మూట కట్టుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని కొన్ని గ్రామాల్లో 800 అడుగులు బోరు వేసినా నీళ్లుపడడం లేదని రైతులు అంటున్నారు. విధిలేక ట్యాంకర్ల ద్వారా నీళ్లు కొని పంటలను రక్షించుకొనే ప్రయత్నాలు చేస్తున్నారు. ట్యాంకర్ నీటికి రూ.200 నుంచి రూ. 500 వరకు ఖర్చు చేస్తూ ఎండిపోతున్న పంటలకు తడులు అందిస్తున్నారు. లక్షలకు లక్షలు అప్పులుచేసి పంటలను కాపాడుకొనే ప్రయత్నం చేస్తున్నారు. కన్నబిడ్డల కంటే ఎక్కువ ప్రాణంగా పెంచిన చెట్లు కళ్లముందే ఎండిపోవడాన్ని చూసి కన్నీటి పర్యంతమవుతున్నారు.

దీర్ఘకాలిక పంటలపై ఎక్కువ ప్రభావం

యాడికి మండలంలోని కోనుప్పలపాడు, పచ్చారుమేకలపల్లి, రాయలచెరువు, కేశవరాయునిపేట తదితర గ్రామాల్లో అరటి, నిమ్మపంటలు ఎక్కువగా సాగుచేశారు. మూడు సంవత్సరాల పాటు వచ్చే అరటిపంటకు నీరు ఎక్కువ అవసరం. దీంతో అరకొరగా వస్తున్న నీటితో పంటను కాపాడుకోలేక ఆశ వదిలేసుకుంటున్నారు. నిమ్మ చెట్లకు ఐదు సంవత్సరాల నుంచి దిగుబడులు ప్రారంభమవుతాయి. పంట దిగుబడులు వచ్చే సమయంలో బోరుబావుల్లో నీళ్లు అడుగంటుతుండడంతో ఏమిచేయాలో దిక్కుతోచని స్థితిలో నిమ్మరైతులు అవస్థలు పడుతున్నారు. పచ్చారుమేకలపల్లి, కోనుప్పలపాడు గ్రామాల్లో నిమ్మ రైతులు ట్యాంకర్లతో నీటిని కొని తడులు అందిస్తున్నారు.

800 అడుగులు వేసినా కనిపించని జలం

కోనుప్పలపాడు గ్రామానికి చెందిన ఒక రైతు 780 అడుగుల లోతు వరకు బోరువేసినా నీళ్లుపడలేదు. యాడికికి చెందిన మరో రైతు సుమారు రూ.లక్షకుపైగా ఖర్చుచేసి 550 అడుగుల బోరు వేశాడు. చుక్క నీరు పడలేదు. పచ్చారుమేకలపల్లికి చెందిన ఒక అరటిరైతు 500 అడుగుల లోతు వరకు బోరువేసినా ఫలితం లేదు. ఏడాదికేడాదికి బోరుబావుల్లో నీళ్లు తగ్గిపోతుండడంతో కొందరు దీర్ఘకాలిక పంటలను సాగుచేయడం మానేశారు. పచ్చారుమేకలపల్లిలో అరటిపంటలో అధిక దిగుబడులు తీసే ఒక రైతు బోరులో నీళ్లు తగ్గిపోవడంతో సాగుని మానేశాడు. స్వల్పకాలిక పంటలు సాగు చేస్తున్నాడు. అరటిపంట ఎక్కువగా సాగు చేసే కేశవరాయునిపేటలో కూడా ఇదే పరిస్థితి.

నీటి తడులకు అవస్థలు

కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చిన పంటలు ఎండిపోతుండడం చూసి రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. పంటలకు నీటితడులు అందించడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తున్నారు. నీరు సమృద్ధిగా ఉన్న కొందరు రైతులు సమీపాన ఉన్న రైతులకు నీటిని ఉచితంగానే అందిస్తూ ఆదుకుంటున్నారు. అరకొరగా నీరు ఉన్నరైతులు ట్యాంకర్ నీళ్లు రూ.200 నుంచి రూ.500 వరకు విక్రయిస్తున్నారు. ట్యాంకర్ల ద్వారా పంటలకు నీరు అందించాలంటే లక్షలకు లక్షలు అప్పులుచేయాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

నీళ్లు కొని తడులు ఇస్తున్నా



నాకు రెండు ఎకరాల్లో నిమ్మచెట్లు ఉన్నాయి. ఎన్నో ఏళ్లుగా కాపాడుకుంటూ వచ్చిన చెట్లు బోరుబావుల్లో నీరు తగ్గిపోవడంతో వాడుపడుతున్నాయి. నిమ్మ చెట్లకు తడులు అందించకపోతే పూర్తిగా ఎండిపోయే ప్రమాదం ఉంది. ట్యాంకర్ నీటిని రూ.200 కొనుగోలుచేసి తడులను ఇస్తున్నా. గతేడాది కొందరు రైతుల బోరుబావుల్లోనీరు పూర్తిగా తగ్గింది. ఈ ఏడాది మరికొన్ని బోరుబావుల్లో తగ్గాయి. ఏడాదికేడాదికి భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయి.

-లక్ష్మీనారాయణ, నిమ్మరైతు, పచ్చారుమేకలపల్లి



నీటి కొరతతో వాడుపడుతున్న నిమ్మచెట్లు



యాడికి వద్ద 600 అడుగులు బోరువేసినా నీళ్లుపడని వైనం

వేసవి వచ్చిందంటే సమస్యే



నేను మూడుఎకరాల్లో నిమ్మచెట్లు సాగుచేశాను. ఎండాకాలం వస్తే బోరుబావుల్లో నీళ్లు పూర్తిగా తగ్గిపోతున్నాయి. చెట్లను కాపాడుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నా. నీటిని కొని ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసుకొని చెట్లకు తడులు అందిస్తున్నా. ప్రతి సంవత్సరం వేసవికాలం వచ్చేసరికి బోరుబావుల్లో నీళ్లు తగ్గిపోతున్నాయి. కొన్ని బోరుబావులు పూర్తిగా ఎండిపోయాయి. పంటలను కాపాడుకోవడం చాలా కష్టతరంగా మారింది.

-చలపతి, నిమ్మ రైతు, పచ్చారుమేకలపల్లి

వైసీపీ పాపం..!

దళిత రైతులకు 1999లో భూముల పంపిణీ

గత ప్రభుత్వంలో రీసర్వే మాటున అన్యాయం



శింగనమల తహసీల్దార్‌కు అర్జీ ఇస్తున్న నిదనవాడ దళిత రైతులు (ఫైల్)

- సర్వే చేయకుండానే మిగులు భూమిగా నమోదు
- జీవనాధారం కోల్పోతున్న అన్నదాతలు
- అధికారులకు వినతులు
- పట్టించుకునే వారు కరువు


శింగనమల, మే 12(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలకుల పాపం.. రైతులకు శాపంగా మారింది. భూములకు భద్రత అంటూ చేపట్టిన రీసర్వేలో దళిత రైతుల పొట్టకొట్టారు. దాదాపు 25 ఏళ్ల క్రితం ప్రభుత్వం అసైన్‌మెంట్ కమిటీ ద్వారా మండలంలోని నిదనవాడ గ్రామ దళితులకు పంపిణీ చేసిన భూమిని ఆన్‌లైన్‌లో మిగులు భూమిగా చూపారు. ప్రభుత్వమే పంపిణీ చేసి.. ఇన్నేళ్లుగా సాగుచేసుకుంటున్న భూములను ఆన్‌లైన్‌లో తొలగించడంతో దళిత రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. సమస్య పరిష్కరించాలని మూడేళ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. ఆఖరుకు కలెక్టర్‌కు సైతం అర్జీ ఇచ్చారు. అయినా.. నేటికీ సమస్య పరిష్కారం కాలేదు. దీంతో జీవనాధారం కోల్పోతే ఆత్మహత్యే శరణ్యమని దళిత రైతులు వాపోతున్నారు.

1999లో పంపిణీ..

మండలంలోని నిదనవాడ గ్రామ పరిధి సర్వే నంబర్లు 213, 214లో 20 ఎకరాలుపైగా ప్రభుత్వ భూమి ఉండేది. దానిని గ్రామానికి చెందిన 15 మంది దళిత రైతులకు ఎకరా నుంచి రెండెకరాల చొప్పున 1999లో అప్పటి టీడీపీ ప్రభుత్వం భూపంపిణీ చేసింది. ఆ మేరకు డీ పట్టాలు పంపిణీ చేసింది. పాసుపుస్తకాలు ఇచ్చింది. ఆన్‌లైన్ చేయలేదు. అప్పట్నుంచి రైతులు పలురకాల పంటలు సాగుచేసుకుంటున్నారు.

సర్వే చేయకుండానే..

గత వైసీపీ హయాంలో భూములకు భద్రత కల్పిస్తామంటూ రీసర్వే చేపట్టారు. అందులో దళిత రైతులకు పంపిణీ చేసిన భూమిని ఆన్‌లైన్‌లో మిగులు భూమిగా నమోదు చేశారు. విషయం తెలిసిన రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. 25 ఏళ్లుగా పంటలు సాగుచేసుకుంటున్న భూములను ఇలా నమోదు చేయడం ఏంటని వాపోతున్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే కూడా చేయకుండానే కార్యాలయంలో కూర్చుని మిగులు భూమిగా నమోదు చేశారని వారు ఆరోపిస్తున్నారు. సమస్య పరిష్కరించాలని బాధిత రైతులు.. అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. మరోసారి సోమవారం శింగనమల తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు.



గతంలో ఇచ్చిన డీ పట్టా

నేను బతికుండగా ఆన్‌లైన్ చేస్తారో.. లేదో..?



నాకు 1999లో సర్వే నంబరు 214-1ఏలో 1.35 ఎకరాల భూమిని ఇచ్చి, పాసుపుస్తం మంజూరు చేశారు. అప్పట్నుంచి భూమి సాగు చేసుకుంటున్నా. రీసర్వేలో అధికారులు భూమి వద్దకు కూడా రాకుండా ఆన్‌లైన్‌లో మిగులుగా నమోదు చేశారు. దీంతో భూమిని ఆన్‌లైన్‌లో తొలగించారు. ప్రతి వారం అధికారులకు వినతులు ఇస్తున్నా.. సమస్య పరిష్కారం కాలేదు. నేను బతికుండగా అన్‌లైన్‌లో అధికారులు నమోదు చేస్తారో.. లేదో..?

-పి.నాగన్న, దళిత రైతు, నిదనవాడ

కలెక్టర్‌కు ఇచ్చినా..



సర్వేనంబరు 213లో 1.89 ఎకరాల భూమికి ప్రభుత్వం పాసుపుస్తకం ఇచ్చింది. మూడేళ్ల క్రితం చేపట్టిన రీసర్వేలో భూమిని అన్‌లైన్ నుంచి తొలగించారు. అప్పట్నుంచి అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా పట్టించుకోలేదు. తరువాత కలెక్టర్‌కు అర్జీ ఇచ్చినా.. అన్‌లైన్‌లో ఇంతవరకు నమోదు చేయలేదు. ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావట్లేదు.

-పెద్దన్న, దళిత రైతు, నిదనవాడ

ఆత్మహత్యే శరణ్యం



నాకు సర్వే నంబరు 213లో 1.35 ఎకరాల భూమి పంపిణీ చేశారు. పాసుపుస్తకం కూడా మంజూరు చేశారు. రీసర్వే సమయంలో అధికారుల నిర్లక్ష్యంతో మా భూమిని కొలతలు తీయకనే అన్‌లైన్‌లో తొలగించారు. అప్పట్నుంచి అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా సమస్య పరిష్కరించలేదు. ఈ భూమే మాకు జీవనాధారం. ఇప్పటికైనా అధికారులు భూమిని అన్‌లైన్‌లో నమోదు చేయకపోతే ఆత్మహత్యే శరణ్యం.

-పూజారి పెద్దన్న, రైతు, నిదనవాడ

సబ్ డివిజన్ చేసి... అన్‌లైన్‌లో నమోదు చేయాలి

మండలంలోని నిదనవాడ గ్రామానికి చెందిన 15 మంది దళిత రైతులకు 1999లో భూ పంపిణీ చేసి, పాసుపుస్తకాలు మంజూరు చేసిన విషయం వాస్తవమే. రీసర్వే సమయంలో అధికారుల చిన్న తప్పిదంతో అన్‌లైన్‌లో తొలగించి, మిగులు భూములుగా నమోదు చేశారు. దళిత రైతుల భూములను మరలా సర్వే చేయించి, సబ్ డివిజన్ చేసి అన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి. వెంటనే సర్వే చేసి, రైతులకు సబ్ డివిజన్ చేయిస్తాం.

-సాకే బ్రహ్మయ్య, తహసీల్దార్, శింగనమల

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

తంజావూరు బాలసరస్వతి (జయంతి)



'పద్మవిభూషణ్' గ్రహీత తంజావూరు బాలసరస్వతి 1918 మే 13న మద్రాస్‌లో జన్మించారు. భారతనాట్య కళాకారిణిగా రాణించడమే కాక కొత్తగా నృత్యం నేర్చుకోదలిచినవారికి తర్ఫీదు ఇచ్చి ప్రోత్సహించారు. కాగా ఆమెకు కొరియోగ్రాఫర్ ఉదయశంకర్ చేయూతనిచ్చి ప్రపంచవ్యాప్తంగా ప్రదర్శనలకు అవకాశం కల్పించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అవార్డులు అందుకున్నారు. సంగీత నాటక అకాడమీ, సంగీత కళానిధి తదితర పురస్కారాల పొందారు. 1984 ఫిబ్రవరి 9న కన్నుమూశారు.

ఆర్‌కే నారాయణ్ (వర్ధంతి)



ఆర్‌కే నారాయణ్‌గా పిలవబడే రాశిపురం కృష్ణస్వామి అయ్యర్ నారాయణ స్వామి 1906 అక్టోబరు 10న చెన్నైలో జన్మించారు. జాతీయస్థాయిలో పేరొందిన రచయిత. 'మాల్గుడి' అనే కాల్పనిక పట్టణాన్ని సృష్టించి అందులోని ప్రజలు, వారి వ్యవహారాల గురించి ధారావాహిక కథలు, నవలలు రాశారు. ఆంగ్లభాషలో భారత సాహిత్య ప్రారంభదశకు చెందిన ముగ్గురు రచయితలలో ఈయన ఒకరు. ముల్క్‌రాజ్ ఆనంద్, రాజారావులు మిగిలిన ఇద్దరూ. భారతీయ సాహిత్యాన్ని ప్రపంచానికి పరిచయం చేసిన ఘనత ఆర్‌కే నారాయణ్‌కు ఉంది. 'ది గైడ్' నవలకు సాహిత్య అకాడమీ పురస్కారం దక్కింది. ఈ నవల హిందీ, ఆంగ్లంలలో సినిమాగా తీయబడింది. 2001 మే 13న ఆయన కన్నుమూశారు.

రవిశంకర్ (పుట్టినరోజు)



ఆధ్యాత్మిక గురువు రవిశంకర్ 1956 మే 13న తమిళనాడు రాష్ట్రం పాపనాశం అనే ప్రాంతంలో జన్మించారు. శ్రీశ్రీగా, గురూజీ అని, గురుదేవ్ అని భక్తులు ఆయనను పిలుస్తారు. 1981లో ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఫౌండేషన్‌ను స్థాపించి సామాజిక చైతన్యం కల్పిస్తున్నారు. శాంతికి, మానవతా విలువలకు రాయబారిగా ఉన్నారు. బెంగళూరు సెయింట్‌జోసెఫ్ కళాశాలలో బీఎస్సీ పూర్తి చేశారు. తన రెండో గురువు మహర్షి యోగేశ్‌యోగితో కలసి ప్రయాణిస్తూ ప్రసంగాలు చేయడం, వేదశాస్త్రాలపై సమావేశాలు నిర్వహించడం, వేదశాస్త్రాలపై సమావేశాలు నిర్వహించడం, ఆయుర్వేద కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రపంచ వ్యాప్తంగా ఆధ్యాత్మికతపై ఆచరణాత్మక అనుభవపూర్వక కోర్సులు నిర్వహిస్తున్నారు.

రాబర్ట్ థామస్ ప్యాటిన్సన్ (పుట్టినరోజు)



రాబర్ట్ డగ్లస్ థామస్ ప్యాటిసన్ 1986 మే 13న జన్మించారు. ఆంగ్లంలో విభిన్న పాత్రలకు, బిగ్ బడ్జెట్ సినిమాలకు, ఇండిపెండెంట్ సినిమాలకు ఆయన ప్రముఖుడు. ప్రపంచంలో అత్యధిక రెమ్యూనరేషన్ అందుకుంటున్న నటులలో ఒకరు. 15వ యేటనే సినీ రంగంలో అడుగు పెట్టారు. హ్యారిపోటర్, గోబ్లెట్ ఆఫ్ ఫైర్ (2005) సినిమాలతో ఎంతో గుర్తింపు పొందారు. ది ట్విలైట్ సాగా సిరీస్ సినిమాలు ప్రపంచవ్యాప్తంగా పేరొందాయి. 2022లో బ్యాట్‌మాన్ సినిమా ఎంతో పేరొందింది. ఫోర్బ్స్ సెలెబ్రిటీ 100లో చోటు దక్కించుకున్నారు.



గడిదం రథోత్సవంలో పాల్గొన్న భక్తులు



కైవారమఠంలో విశేషపూజల్లో పాల్గొన్న భక్తులు



దూలపల్లి రథోత్సవంలో భక్తులు

వైభవంగా గడిదం బ్రహ్మరథోత్సవం

- వైశాఖ పౌర్ణమి సందర్భంగా విశేషపూజలు
- పలు చోట్ల రథోత్సవాలు

బాగేపల్లి, మే 12 (ఆంధ్రజ్యోతి): రెండో తిరుమలగా ప్రసిద్ధి చెందిన తాలూకాలోని చారిత్రాత్మకమైన దేవరగుడిపల్లి (గడిదం) హిందూ ధార్మిక, ధర్మాదాయ శాఖ పరిధిలోని లక్ష్మీవేంకటరమణస్వామి బ్రహ్మ రథోత్సవం వైభవంగా జరిగింది. సోమవారం భక్తుల గోవింద నామస్మరణమధ్య రథోత్సవం కొనసాగింది. ఈనెల 6న అంకురార్పణ, ధ్వజారోహణతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. రోజుకొక ఉత్సవం చొప్పున గరుడ, హనుమంత, సింహ, శేషవాహనోత్సవాలు కళ్యాణో త్సవాలు, దీపోత్సవాలు జరిగాయి. సోమవారం వేకువ జామున భూనీళా సమేత లక్ష్మీవేంకటరమణస్వామి మూలవిరాట్టుకు వేదబ్రహ్మ ప్రకాశ్‌రావ్ ఆధ్వర్యంలో సుప్రభాత సేవ, ఇతర ధార్మిక కార్యక్రమాలు కొన సాగాయి. విశేష మహామంగళారతి అనంతరం రథోత్స వానికి శ్రీకారం చుట్టారు. భక్తులు పండ్లు, పూలు, నైవే ద్యం సమర్పించారు. సరిహద్దులోని ఆంధ్రప్రదేశ్ ప్రాంత వాసులతో పాటు బెంగళూరు నుంచి కూడా పెద్దసంఖ్యలో రథోత్సవంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే ఎస్ఎన్ సుబ్బారెడ్డి, తహసీల్దార్ మనీషా ఎన్ పత్రి, ఈఓ జీవీ రమేశ్, సీఐ ప్రశాంత్‌వర్ధి విశేషపూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఉత్సవ మూర్తులను రథంపై కొలువుదీర్చారు. భక్తుల గోవింద నామస్మరణ మధ్య రథోత్సవం సాగింది. చుట్టు పక్కల గ్రామాలనుంచి ఎడ్లబండ్లు, ట్రాక్టర్లలో వచ్చిన భక్తాదులు



భూనీళా సమేత లక్ష్మీవేంకటరమణస్వామికి విశేషహారతి

పానకం, మజ్జిగ, పెసరపప్పు పంపిణీ చేశా రు. ఇదే సందర్భంగా గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ప్రజలకు ఉచిత వైద్య పరీక్షా శిబిరం నిర్వహించారు. గడిదం బ్రహ్మరథోత్సవం సందర్భంగా పశువుల జాతర సైతం కొనసాగింది. ఆవులకు తాత్కాలిక షెడ్‌లు వేసి నీడ కల్పించారు. నీటితొట్టెలు అమర్చారు. పెద్దసంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

కైవారలో పున్నమి పూజలు

చింతామణి: తాలూకాలోని పుణ్యక్షేత్రం కైవారలో సద్గురు యోగినారేయణ మఠంలో వైశాఖ పున్నమిని పురస్కరించుకుని సోమవారం విశేషపూజలు నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత అమరనారేయణస్వామి, సద్గురు నారేయణ తాతయ్య ఉత్సవమూర్తిలకు అభిషేకం, అష్టావధాన సేవ నిర్వహించారు. మహా మంగళారతి అనంతరం ప్రాకారోత్సవం తరహాలో రథోత్సవాన్ని నిర్వహించారు. మఠం ప్రాంగణంలోని నాద సుధారస వేదికపై అఖండ సంకీర్తన కొనసాగింది. పెద్దసంఖ్యలో పాల్గొన్న భక్తులకు మఠం ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

ఆలంబగిరిలో గిరి ప్రదక్షిణ

తాలూకాలోని ఆలంబగిరిలో కల్కి శ్రీలక్ష్మీ వేంకటరమణస్వామి దేవాలయం నుంచి ఒక కిలో మీటరు దూరంలో ఉన్న ఆలంబగిరి కొండకు ప్రకృతి రమణీయత నడుమ పున్నమి సంకీర్తనతోపాటు గిరిప్రదక్షిణ కొనసాగింది. కైవార క్షేత్ర ధర్మాధికారి డాక్టర్ ఎంఆర్ జయరాం తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీవేంకటేశ్వరస్వామి రథోత్సవం

ముళబాగిలు: తాలూకాలోని దూలపల్లిలో పురాణ ప్రసిద్ధ లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మరథోత్సవం సోమవారం వేలాది భక్తుల గోవిందనామస్మరణ నడుమ జరిగింది. ఉదయం మూల విరాట్టుకు పంచామృ తాభి షేకం, విశేష పుష్పాలంకరణ జరిగింది. సంప్ర దాయాల ప్రకారం ఉత్సవమూర్తులను అలంకరించిన అనంతరం రథంపై కొలువుదీర్చి రథోత్సవానికి శ్రీకారం చుట్టారు. చుట్టు పక్కల గ్రామాల ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. రథంపైకి దవనం, అరటి పండ్లు, పూలు, ఉప్పు సమర్పించి మొక్కులు తీర్చు కున్నారు. అర్చకుడు సురేశ్ నేతృత్వంలో పూజా కైంకర్యాలు కొనసాగాయి. సేవాకర్తలు పానకం, మజ్జిగ, పెసరపప్పు పంపిణీ చేశారు. స్థానిక ప్రముఖులు వెంకటరామ్, రాజ్‌కుమార్, కేశవ మూర్తి, శేఖర్, శ్రీహరి, డీఎం రవి, శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కోదండరామస్వామి రథోత్సవం

బంగారపేట: వైశాఖ పున్నమిని పురస్కరిం చుకుని పట్టణంలోని పురాణ ప్రసిద్ధ కోదండ రామస్వామి రథోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. వేకువజామున పూజాకైంకర్యాలు నిర్వహించారు. ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణస్వామి, ఎంపీ మల్లేశ్‌బాబు రథోత్సవాన్ని ప్రారంభించారు. పట్టణంలోని బజార్‌రోడ్డు, మల్లప్పరోడ్డు మార్గాలలో మంగళవాయిద్యాల మధ్య భక్తుల జైశ్రీరామ్, జై శ్రీరామ్ నినాదాల నడుమ రథోత్సవం కొనసాగింది. ఆలయ ఆవరణలో ఉత్తమమైన కాంప్లెక్స్ నిర్మించేందుకు రూ.15కోట్లు విడుదల చేయడంతో పనులు ప్రారంభమైనట్టు ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణస్వామి తెలిపారు. రథం 40ఏళ్ల పాతది కావడంతో నూతనంగా నిర్మించే ప్రయత్నం చేస్తామన్నారు. రథోత్సవంలో వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు.



బంగారపేట రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

రాష్ట్రవ్యాప్తంగా బుద్ధ జయంతి

బెంగళూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): వైశాఖ మాసం పౌర్ణమిన బుద్ధ పూర్ణిమగా పిలుస్తారు. భగవాన్ గౌతమబుద్ధుడు జన్మించిన, జ్ఞానోదయమైన రోజును ఆధ్యాత్మిక దినంగా భావిస్తారు. రాష్ట్రంలో ప్రధానంగా బెంగళూరు, కొడగు జిల్లాతోపాటు వివిధ ప్రాంతాలలోని బౌద్ధక్షేత్రాలలో సోమవారం ప్రత్యేక కార్యక్రమాలు జరిగాయి. బెంగళూరు గాంధీనగర్‌లోని మహాబోధి సొసైటీ ఆధ్వర్యంలో బుద్ధ జయంతి వేడుకలు జరిపారు. తొలుత బౌద్ధభిక్షువులకు ప్రజలు ఆహార పదార్థాలు, కానుకలు, నగదు తదితర వస్తువులు సమర్పించారు. ఆ తర్వాత ప్రార్థనలు కొనసాగాయి. అనంతరం మహాబోధి సొసైటీ ముఖ్యులు బుద్ధుడి ఆశయాలను సందేశం రూపంలో వినిపించారు. మధ్యాహ్నం వేలాదిమందికి మహాబోధి సొసైటీ అన్నదానం చేసింది. కొడగు జిల్లా కుశాల్‌నగర్‌లో గోల్డెన్ టెంపుల్‌లోనూ, బైలకుప్పలోని బుద్ధ ఆలయంలోనూ ప్రత్యేక కార్యక్రమాలు కొనసాగాయి.



మహాబోధి సొసైటీలో విశేషపూజల్లో బౌద్ధ భిక్షువులు



ప్రార్థనల్లో బౌద్ధభిక్షువుల

వైభవంగా కరగ మహోత్సవం



పురవీధుల్లో కరగధారి ఊరేగింపు

ముళబాగిలు, మే 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ధర్మరాజపాళ్యలో కొలువైన ద్రౌపతమ్మ దేవి ఆలయ 119వ వార్షిక పూల కరగ మహోత్సవం వేలాదిభక్తుల నడుమ వైభవంగా కొనసాగింది. కరగధారి ఎన్ వెంకటేశ్ పురవీధులలో గుండా కొనసాగగా ఇళ్లముంగిట రంగవల్లులతో ఆహ్వానించారు. అంతకుముందు ద్రౌపతమ్మదేవికి అభిషేకం, విశేష పుష్పాలంకరణ నిర్వహించారు. వహ్నికుల క్షత్రియసంఘం ఆధ్వర్యంలో కరగ ఉత్సవం కొనసాగింది. కరగను పురస్కరించుకుని ద్రౌపతమ్మ అర్జునోత్సవం, శ్రీకృష్ణ, బసవణ్ణపాళ్యకు చెందిన గంగమ్మ, తిరుపతి గంగమ్మ, సోమేశ్వర, వీరభద్ర స్వామి, విఠలనారాయణస్వామి, గ్రామదేవత ఆదినాంచారమ్మ, కైవార నారేయణస్వామి, ఎడిపాళ్య గంగమ్మ, నేతాజినగర్ దేవతలు ఓంశక్తి, అంగాళ పరమేశ్వరి, మల్లసంద్ర రణబేరమ్మ, నాగమ్మ తదితర దేవతల పల్లకీ ఉత్సవాలు కొనసాగాయి. కోలారు ఎమ్మెల్యే కొత్తూరు మంజునాథ్, ఎమ్మెల్సీ అనిల్‌కుమార్, తహసీల్దార్ వీ గీతా, కాంగ్రెస్ నాయకుడు ఆదినారాయణ, సీనియర్ ప్రముఖుడు హోరమావు సోమనాథ్, వహ్నికుల సంఘం జిల్లా ధ్యక్షుడు ఎం వెంకటేశ్, మైక్ శంకర్, ట్రస్టు అధ్యక్షుడు ఎం కృష్ణప్ప తదితరులు పాల్గొన్నారు.

సందడిగా హసికరగ ఉత్సవం



హసికరగను ఊరేగిస్తున్న దృశ్యం

బంగారపేట, మే 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ధర్మరాయస్వామి దేవ స్థానంలో వైశాఖ పున్నమి నేపథ్యంలో ఆదివారం రాత్రి హసికరగ నిర్వహించారు. వహ్నికుల క్షత్రియ ద్రౌపతాంబ దేవి కరగ ఉత్సవం జరిగింది. దేశిహళ్ళి చెరువులో ఉత్సవం నిర్వహిం చారు. ధార్మిక కార్యక్రమాలు కొనసాగాయి. పూజారి కృష్ణమూర్తి హసికరగతో ఊరేగగా వంద లాదిమంది వీరకుమారులు గోవింద నామస్మరణతో కొనసాగారు. కేజీఎఫ్ మెయిన్‌రోడ్డు నుంచి బస్టాండ్, మెయిన్ బజార్‌రోడ్డు, ఆర్‌హెచ్ రోడ్డు, కువెంపు సర్కిల్, నంది మెడికల్ సర్కిల్, కారహళ్ళి సర్కిల్ మీదుగా ధర్మరాయ స్వామి దేవస్థానానికి చేరింది. మంగళవారం రాత్రి పూలకరగ మహోత్సవం జరగనుంది.

డ్రోన్ సవాళ్లలో పీఈఎస్ బృందానికి రెండో బహుమతి



బహుమతితో విద్యార్థుల బృందం

బెంగళూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): చెన్నైలో జాతీయస్థాయి స్థిర - వింగ్ డ్రోన్ పోటీలలో పీఈఎస్ యూనివర్సిటీ బృందం ఏవియస్‌కు రెండో స్థానం దక్కింది. బృందానికి రూ.45వేల బహుమతి లభించింది. క్యాడ్ పరికరాలు ఉపయోగించుకుని విమాన ప్రయోగాల ద్వారా ప్రారంభించారు. కేజీ బరువుతో రూపొందించిన డ్రోన్ పలు ప్రయోగాలలో విజయవంతం సాధించింది. విద్యార్థుల బృందానికి గుర్రం శ్రేయ లీడర్‌గా వ్యవహరించగా బీఎస్ అనురాగ్ రావ్, గీతేశ్ నాయుడు, శుభంగి శ్రీవాత్సవ్, ఉదయ్‌గోపన్, ఆదర్శ్ డీ, జాహ్నవి అశ్విన్‌కేర్, హేమంత్ ఉదితి మౌర్యాంక్, హేమాక్ష బ్రేజలు డ్రోన్ ప్రదర్శనలో పాల్గొన్నారు. అధ్యాపకులు డాక్టర్ ఎస్‌వీ సతీశ్ సారథ్యం వహించారు. జాతీయస్థాయి డ్రోన్ పోటీలలో ఉత్తమ ప్రదర్శనలకు బహుమతి సాధించిన మేరకు చాన్సలర్ ప్రొఫెసర్ జవహర్ దొరస్వామి విద్యార్థి బృందాన్ని ప్రత్యేకంగా ప్రశంసించారు.

లాకర్లకు డిమాండ్

బెంగళూరు, మే 12(ఆంధ్రజ్యోతి): విలువైన ఆభరణాలు, ఇతర వస్తువుల భద్రత కోసం లాకర్లకు డిమాండ్ పెరుగుతోందని అందుకు అనుగుణంగానే ఏయూఆర్ఎం సేవలు ప్రారంభించినట్టు విజయ్‌కుమార్ అరిశెట్టి ప్రకటించారు. బెంగళూరులో ఈమేరకు ఏయూఆర్ఎం సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గతంలో బ్యాంకు ఖాతాలు ఉండేవారు లాకర్లను ఉపయోగించుకునేవారన్నారు. ఇటీవల లాకర్లకు డిమాండ్ పెరిగిందని, అందుకు తగినట్టుగా సౌలభ్యాలు లేవన్నారు. అందుకే ఏయూఆర్ఎం అపార్ట్‌మెంట్లలో లాకర్ సేవలను అందు బాటులోకి తెచ్చిందన్నారు. ఇప్పటికే 5వేల లాకర్లు వినియోగించు కుంటున్నారన్నారు. ఈ ఏడాది చివరకు కనీసం 50వేలమందికి సేవలు అందుబాటులోకి తీసుకురాదలచినట్టు పేర్కొన్నారు. ఆభరణాల ధరలు అమాంతం పెరిగాయని అందుకు భద్రతకోసం ప్రతి ఒక్కరూ లాకర్లను ఆశ్రయిస్తున్నారన్నారు. ఏయూఆర్ఎం లాకర్ బయోమెట్రిక్‌తోపాటు ఇతరత్రా సాంకేతిక విధానాలకు అనుగుణంగా ఏర్పాటు చేశామన్నారు. టాటా ఏఐజీ జనరల్ ఇన్సూరెన్స్‌తో ఒప్పందం ఉందన్నారు. ప్రతి లాకర్‌కు సమగ్రమైన బీమా రక్షణ కల్పిస్తున్నామన్నారు. సూరజ్ హెచ్ఎస్, ప్రతాప్ చందనలతో కలసి ఏయూఆర్ఎంను ప్రారంభించామన్నారు.

యాదగిరిలో తోపుడుబండి దుకాణం ధ్వంసం


- పహల్గాం దాడిపై అనుచిత వీడియో ఎఫెక్ట్

బెంగళూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదులు మతం అడిగి మరీ మారణకాండకు విశ్వమంతటా వ్యతిరేకత వ్యక్తం అవుతోంది. మతం అడిగి కాల్చి చంపారంటూ భరత్ భార్య వ్యాఖ్యల వీడియోను స్టేటస్‌కు వేసుకున్న మేరకు ఎగ్‌రైస్ తోపుడుబండి దుకాణాన్ని ధ్వంసం చేశారు. యాదగిరి జిల్లా రాజం కొళ్ళూర్ గ్రామం మీర్‌సాబ్‌తోపాటు ముగ్గురిపై కొడేకల్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ సంఘటనతో ఆగ్రహానికి లోనైన రాజంకొళ్ళూర్ గ్రామానికి చెందిన యువకులు శనివారం రాత్రి మీర్‌సాబ్‌కు చెందిన ఎగ్‌రైస్ తోపుడుబండిని ధ్వంసం చేశారు. గ్రామ సమీపంలో ఉండే రహదారిపక్కనే ఎగ్‌రైస్ దుకాణం నిర్వహించేవాడు. మూడురోజుల కిందట స్టేటస్‌గా పెట్టుకున్నారు. పెద్దలను చూసి నేర్చుకోవాలంటూ కూడా రాసుకున్నారు. సమాజంలో శాంతిభద్రతలకు భంగం కలిగించేలా వ్యవహరించారని పోలీసులు కేసు నమోదు చేశారు. రెండు రోజులుగా మీర్‌సాబ్ దుకాణం ఏర్పాటు చేయలేదు. శనివారం రాత్రి అతడి దుకాణాన్ని ధ్వంసం చేశారు.

తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్య

బెంగళూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): తండ్రి ఉపయోగించే సింగిల్ బ్యారెల్‌గన్‌తో కాల్చుకుని బయ్యేశ్ (28) అనే యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఇటీవలే విదేశాలనుంచి చదువు ముగించుకుని బెంగళూరుకు వచ్చాడు. ఆదివారం బయ్యేశ్ తల్లిదండ్రులు తిరుపతికి వెళ్లారు. సోమవారం ఉదయం వాపసు రాగా ఫాం హౌస్‌లో బయ్యేశ్ ఆత్మహత్య చేసుకున్న విషయం బెంగళూరు గ్రామీణ జిల్లా దేవనహళ్ళి పరిధిలో చోటు చేసుకుంది. తిరుమలశెట్టి పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ఎమ్మెల్యే పుట్టరంగశెట్టి కుమారుడు మృతి



చామరాజ్ (ఫైల్)

బెంగళూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న చామరాజనగర కాంగ్రెస్ ఎమ్మెల్యే పుట్టరంగశెట్టి కుమారుడు చామరాజ్ (42) సోమవారం కన్నుమూశారు. ఇటీవల కొన్నిరోజులుగా బెంగళూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్సలు పొందుతుండేవారు. ఎమ్మెల్యే పుట్టరంగ శెట్టికి చామరాజ్ పెద్ద కుమారుడు. ఇతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పార్థివదేహాన్ని చామ రాజనగర్‌లోని యల్లందూరు తాలూకా ఉప్పినమోళికి తరలించారు. మంగళవారం అంత్యక్రియలు జరపనున్నట్టు ప్రకటించారు.

గడువులోగా పనులు పూర్తి చేయండి



భూమిపూజలో ఎమ్మెల్యే మంజుళాలింబావళి

మహదేవపుర, మే 12 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులను నాణ్యతతో గడువులోగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు ఎమ్మెల్యే మంజుళా అరవింద లింబావళి సూచించారు. నియోజకవర్గం మారతహళ్ళి ప్రాంతంలోని సంజయ్‌నగర్, కార్తీక్‌నగర్, కుందలహళ్ళి, ఐటీపీఎల్, నల్లూరహళ్ళి, హగదూరు రోడ్డు ఇతర అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. మారతహళ్ళి చుట్టుపక్కల ప్రాంతాలు ఐటీబీటీ కంపెనీలకు నెలవుగా ఉన్నాయన్నారు. ఇక్కడ రోడ్లు, లే అవుట్‌లకు మౌలిక సదుపాయాలు కల్పించడం మా బాధ్యత అన్నారు. కార్యక్రమంలో హోబళి బీజేపీ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్రపరిషత్ సభ్యుడు ఎల్ రాజేశ్, నాయకులు మారప్ప, హగదూరు శ్రీనివాస్, చందన్, మునిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కార్తీక్ హంతకులకు గుణపాఠం చెబుతాం

- సోషల్ మీడియాలో వైరల్

బెంగళూరు, మే 12(ఆంధ్రజ్యోతి): మైసూరు తాలూకా వరుణ శివారులో హత్యకు గురైన రౌడీషీటర్ క్యాతమారనహళ్ళి కార్తీక్ ఇటీవల హత్యకు గురైన విషయం తెలిసిందే. సన్నిహితులే అతడిని హత్య చేసినట్టు గుర్తించిన పోలీసులు పదిమందిని అరెస్టు చేశారు. తాజాగా కార్తీక్‌ను హతమార్చిన వారికి తగిన గుణపాఠం చెబుతామని, కొట్టి తీరుతామని సోషల్‌మీడియాలో పోస్ట్ వైరల్ అయ్యింది. జగదీశ్ అనే వ్యక్తి సోషల్‌మీడియా ఖాతానుంచి పోస్టు అయ్యింది. కార్తీక హత్య నిందితులను కొడతామని, మీకూ ఓ కాలం వస్తుందనే పోస్ట్ వైరల్ అయ్యింది. ఈమేరకు జగదీశ్‌పై వరుణ పోలీసులు కేసు నమోదు చేశారు.

చౌడేశ్వరీదేవికి విశేషపూజలు



అలంకరణలో అమ్మవారు

చేళూరు, మే12 (ఆంధ్రజ్యోతి): సరిహద్దులోని అమడగూరులో పురాతనమైన చౌడేశ్వరి ఆలయంలో వైశాఖ పున్నమిని పురస్కరిం చుకుని సోమవారం విశేషపూజలు నిర్వహించారు. ఆలయంలో చైత్రపౌర్ణమికి కూడా విశేష పూజలు కొనసాగాయి. అనంతరం వారంపాటు ఉత్సవాలు జరిగాయి. ప్రస్తుతం అమ్మవారికి నూత నంగా రథాన్ని సిద్ధం చేస్తున్నామని ఆలయ ధర్మకర్త పురు షోత్తమరెడ్డి తెలిపారు. విప్పమాను కొయ్యలతో రథాన్ని రూపొందిస్తున్నామని, సుమారు 18 లక్షల రూపాయల ఖర్చు కానుందని భక్తులు సహకరించాలని కోరారు.

దళితుల సమస్యలపై సమావేశం

శిడ్లఘట్ట, మే 12 (ఆంధ్రజ్యోతి): రూరల్ పోలీస్‌స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ కే సతీశ్ ఆధ్వర్యంలో శిడ్లఘట్ట రూరల్ పోలీస్ స్టేషన్‌లో దళితుల సమస్యలపై సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. దళిత ప్రముఖులు పాల్గొని తమ సమస్యలు వివరించారు. తాలూకాలోని ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలల్లో తమ పిల్లలు చదువుతున్నారని, ప్రభుత్వం నిర్ణయించిన ఫీజుల వివరాలు తెలియచేయడం లేదని, శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. దళితుల సమస్యలు కేవలం పోలీస్ స్టేషన్‌కే పరిమితం కా కుండా గ్రామపంచాయతీ స్థాయిలోనూ సమావేశాలు నిర్వహించాలని, అక్కడక్కడ చోటు చేసుకునే తారతమ్య ధోరణులకు అడ్డుకట్ట వేయాలని కోరారు. సమావేశంలో నాగనరసింహ, విజయ్‌కుమార్, అరుణ్‌కుమార్, సణ్ణప్ప, కోటళ్ళి అనిల్‌కుమార్, అశోక్, బైరగనహళ్ళి కిరణ్, చలపతి, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.



తుంగభద్ర నీటి మట్టం :1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1586.02	1,577.64
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	1,429	41
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	284	13
నీటి నిల్వ (టీఎంసీలు)	8.01	3.43



మాట్లాడుతున్న ఎస్పీ శోభారాణి

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

బళ్లారిరూరల్, మే 12 (ఆంధ్రజ్యోతి): నగరంలోని డీఆర్ గ్రౌండ్ పోలీసు మైదానంలో సోమవారం ఉదయం డాక్టర్ ఎస్పీ శోభారాణి బళ్లారి జిల్లా రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ పరేడ్ నిర్వహించారు. దాదాపుగా జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల నుంచి 661 మంది రౌడీ షీటర్ల పిలిపించి ఎస్పీ శోభారాణి పలు విషయాలను ఆరా తీశారు. గతంలో రౌడీలుగా ఉంటూ ఈ రోజుల్లో ఏ వృత్తి నిర్వహిస్తున్నారు. అప్రూవల్‌గా మారారా, ప్రతి పోలీస్‌స్టేషన్‌లో ఎంతమంది రౌడీ షీటర్లు యాక్టివ్‌గా వున్నారు, ఎంతమంది సీనియర్ సిటిజన్లు ఉన్నారు తదితర విషయాలపై ఆరా తీశారు. రౌడీ కార్యకలాపాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నవీన్ కుమార్, డీఎస్పీలు చంద్రకాంతనందరెడ్డి, వెంకటేష్ గోకులే పలు పోలీస్ స్టేషన్లో సీఐలు, ఎస్ఐలు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా శంకరలింగస్వామి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

తోరణగల్లు, మే 12 (ఆంధ్రజ్యోతి) : ప్రసిద్ధి గాంచిన తోరణగల్లు శంకర్‌లింగస్వామి రథోత్సవాన్ని ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రజలు ఘనంగా నిర్వహించారు. స్వామివారికి వివిధ ధార్మిక పూజలు ఆచరించి నాయంత్రం రథోత్సవం నిర్వహించారు. వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.

తుపాకీ పేలి యువకుడికి గాయాలు

రాయచూరు, మే 12(ఆంధ్రజ్యోతి): నగరంలోని హెచ్‌ఆర్‌బీ కాలనీలో ప్రమాదవశాత్తు తుపాకీ పేలి యువకుడికి గాయాలైన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. కాలనీలో నివసిస్తున్న జియా సౌదాగర్ అనే యువకుడు సోహెల్ అనేతన మిత్రుడిని పిస్తోల్ చూపించే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో అప్పటికే లోడ్ చేసి ఉన్న పిస్తోల్ అకస్మాత్తుగా పేలడంతో సోహెల్‌కు కాళ్లకు గాయాలైయ్యాయి. వెంటనే రిమ్స్ ఆస్పత్రికి వెళ్లి చికిత్స పొందిన అనంతరం యువకుడు క్షేమంగా ఇంటికి తిరిగి వచ్చినట్లు కుటుంబ వర్గాలు తెలిపాయి. కాగా ప్రమాదవశాత్తు పిస్తోల్ పేలిన సంఘటన ఎవ్వరికి చప్పవద్దంటు తనను జియా సౌదాగర్ బెదిరించాడని బాధితుడు సోహెల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ సంఘటనకు సంబంధించి సదర్ బజార్ పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా పిస్తోల్ పొందిన యువకుడికి లైసెన్స్ ఉందా? అధికారికంగా పొందిన పిస్టోల్? అన్నదానిపై అధికారులు దర్యాప్తు ప్రారంభించారు.

రేపు బెంగళూరులో ఎస్‌యూసీఐ ఆందోళన

బళ్లారి సిటీ, మే 12(ఆంధ్రజ్యోతి): రైతులు, కార్మికుల సమస్యలు పరిష్కరించాలన, పెరిగిన ధరలు తగ్గించాలని, కర్మాగారాల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఎస్‌యూసీఐ ఆధ్వర్యంలో బెంగళూరు ఫ్రీడం పార్కులో భారీ ఆందోళనచేపడుతున్నట్లు పార్టీ జిల్లా కార్యదర్శి రాధాకృష్ణ పేర్కొన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో పోస్టర్లు విడుదల చేసిన ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి 10,000మందికి పైగా ప్రజలు నిరసనలో పాల్గొంటారన్నారు. బళ్లారి-విజయనగర డివిజన్ నుంచి దాదాపు 500మంది బెంగళూరుకు బయలుదేరుతున్నారు. మైసూర్, బెంగళూరు ,తుమకూరు, దార్వాడ్, కొప్పళ, దావణగేరె, మైసూరు, కలబుర్గి,విజయపుర , యాదగిరి, రాయచూర్, చామరాజనగర్ జిల్లా కేంద్రాల్లో ఇప్పటికే ప్రచార సభలు పూర్తయ్యాయన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పోటీలో ఉన్నట్లుగా ఒకరినొకరు నిందించుకుంటూ ధరలు పెంచేసి ప్రజలను దోచుకుంటున్నాయన్నారు. వంటాగ్యాస్, మందులు,విద్యుత్, పాలు, డీజీల్, నీరు, ఆస్తిపన్ను, ప్రతిదీ ఖరీదైనవిగా మారాయన్నారు. ఆస్పత్రుల్లో సౌకర్యాలు కరువయ్యావని, గర్భిణులు మరణించినా దిక్కులేకుండా పోయిందన్నారు. అభివృద్ధిపేరుతో ప్రజల పన్నుల డబ్బు కార్పోరేట్ కంపెనీలు, పెద్దకాంట్రాక్టు, రెడ్‌కాలర్ రాజకీయ నాయకులు సీనియర్ అధికారుల జేబుల్లోకి వెళ్తున్నాయన్నారు. రాష్ట్ర రాజకీయాల్లో ప్రజా పోరాట స్వరాలు అణచివేయబడిన నేటి పరిస్థితిలో ప్రజల నిజమైన సమస్యలను తెరపైకి తీసుకురావడానికి ఎస్‌యూసీఐ రాష్ట్ర కమిటీ మే 14న బెంగళూరులో భారీ రాష్ట్ర స్థాయి సామూహిక పోరాటాన్ని నిర్వహిస్తుందన్నారు. రైతులు, కార్మికులు, విద్యార్థులు, యువత,మహిళలు,వేలాదిగాపాల్గొని పోరాటాన్నివిజయవంతం చేయాలన్నారు. ఈసందర్భంగా జిల్లా కమిటీ సభ్యులు మంజుళ,నాగలక్ష్మి,డాక్టర్ ప్రమోద్, ఈశ్వరీ, ఉమా తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లు విడుదల చేస్తున్న జిల్లా కార్యదర్శి రాధాకృష్ణ తదితరులు



అవార్డులతో కరాటే మాస్టర్లు

బళ్లారి కరాటే మాస్టర్లకు అంతర్జాతీయ అవార్డు

బళ్లారి సిటీ, మే 12(ఆంధ్రజ్యోతి): షోటోకాన్ కరాటే అకాడమీ కర్ణాటక కరాటే క్రీడాకారులు అంతర్జాతీయ అవార్డులు సాధించారు. మే 9నుంచి 11వరకు మలేషియాలోని పెరాక్ రాష్ట్రం ఇఫోలో జరిగిన 21వ అంతర్జాతీయ కరాటే టోర్నమెంట్‌లో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించి కటా, కుమిత్ విభాగాలలో పాల్గొని వారు ఈ అవార్డులు గెలుచుకున్నారు. 8సంవత్సరాల వయస్సు విభాగంలో దేవాన్ష్ కుమిత్ 35కిలోల విభాగంలో రెండవ స్థానంలో, 10సంవత్సరాల వయస్సు విభాగంలో ధనుష్ రెడ్డి, కుమిత్ 27కిలోల విభాగంలో మొదటి స్థానంలో, 14సంవత్సరాల వయస్సు గల విభాగంలో సుమంత కుమితే 52కిలోల విభాగంలో మూడవ స్థానంలో40సంవత్సరాల వయస్సుగల విభాగంలో మొదటిస్థానంలో నిలిచారు. 40 ఏళ్ళు పైబడిన కోచ్‌లలో కాటా విభాగంలో మూడవ స్థానాన్ని సాధించారని జట్టు కోచ్ కట్టేస్వామి అన్నారు.

భక్తి శ్రద్ధలతో బుద్ధజయంతి



బుద్ధుడి విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న ప్రగతిశీల నాయకులు

బళ్లారి సిటీ/రూరల్, మే 12(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని సంగనకల్లు కొండల్లో బౌద్ధపౌర్ణమిని సోమవారం ఘనంగా నిర్వహించారు. బహిరంగ బుద్ధ విహారంలో జరిగిన ఈ కార్యక్రమంలో బుద్ధ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ప్రగతిశీల ఆలోచనపరుడు సిరిగేరి పన్నరాజ్ బుద్ధుడి అష్టాంగ మార్గంపై ఉపన్యాసం ఇచ్చారు. ఈసందర్భంగా కమలరత్న బంతేజ్, రిజ్వాన్, సంగనకల్లు విజయకుమార్, నాగలచెరువు గోవిందు, హవంబావి లోకేశ్, చలవాది ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గూళప్ప, బసవదళ అధ్యక్షుడు రవిశంకర్, దళిత సాహితీవేత్త వెంకమ్మ, వెంకటయ్య, బైలూరు నింగప్ప, రుద్రేశ్, హొన్నూరప్ప, చంద్రు, గోనాల్ మానయ్య, లోకేశ్, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

సంజీవరాయనకోట పాఠశాలలో..

అహింసను ప్రపంచానికి పరిచయం చేసిన మహనీయుడు గౌతమ బుద్ధుడని కర్ణాటక రాష్ట్ర క్రియా శీల ఉపాధ్యాయ వేదిక బళ్లారి జిల్లా యూనిట్ అధ్యక్షుడు రవిచెళ్ల గుర్కి అన్నారు. తాలూకాలోని సంజీవరాయనకోట ప్రభుత్వ ఉన్నత ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన బుద్ధ పూర్ణిమ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ధ్యానం ఏకాగ్రత ద్వారా పరిపూర్ణ జ్ఞానోదయం పొందిన వారు. కోరికలే బాధలకు మూల కారణమని బుద్ధుడు ప్రచారం చేశారన్నారు. మితమైన ,అవసరమైన కోరికలు మనశ్శాంతిని కలిగిస్తాయని, అవి మనస్సును సమతుల్యంగా ఉంచుతాయని బోధించారన్నారు. ప్రజలు సమాజ జీవితానికి ప్రాముఖ్యత ఇచ్చికలిసి జీవించినప్పుడు వారు స్వర్గపు ఆనందాన్ని అనుభవిస్తారని వారు అంటున్నారు. ద్వేషం, అసూయలను విడిచిపెట్టినప్పుడే మన శ్శాంతి లభిస్తుందన్న బుద్ధుడి బోధనలు నిత్యం ఆచరణీయమన్నారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. టీచర్ సుమతి, విద్యార్థులు పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న విద్యార్థులు, టీచర్లు

సిరుగుప్ప: సత్యం, అహింస, దయ, కరుణ, శాంతి, గౌతమ బుద్ధుని తత్వ సిద్ధాంతాలను పాటించాలని తహసీల్దార్ నరసప్ప పిలుపునిచ్చారు. సోమవారం సిరుగుప్ప పట్టణం తహసీల్దార్ కార్యాలయంలో గౌతమబుద్ధుడి జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన భావచిత్రపటానికి పూజలు చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ రాఘవేంద్ర, బీసీ సంక్షేమ శాఖ డైరెక్టర్ మల్లికార్జున పాల్గొన్నారు.



గౌతమ బుద్ధుడికి నివాళి అర్పిస్తున్న తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది

దొడ్డనగౌడ సేవలు అపారం

- జయంతి వేడుకల్లో కళాభిమానులు

బళ్లారి సిటీ, మే 12(ఆంధ్రజ్యోతి): నగరంలోని రాఘవ కళామందిరంలో రాఘవ మెమోరియల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన డాక్టర్ జోళదరాశి దొడ్డనగౌడ 30వ వర్ధంతి కార్యక్రమాన్నిఆ సంస్థ కార్యనిర్వాహణాధికారులు, వారి కుటుంబ సభ్యులు జ్యోతివెలిగించి నివాళి అర్పించారు. కార్యక్రమంలో సంస్థ కమిటీ సభ్యుడు బసవరాజ్ మాట్లాడుతూ.. జోళదరాశి దొడ్డనగౌడ నాటకం, సాహిత్యం, హాస్యం కళలకు చేసిన అపారమైన సేవను గుర్తు చేసుకున్నారు. ఆయన జూలై 27న 1910న తల్లి రుద్రమ్మ, తండ్రి పంపనగౌడ దంపతులకు జన్మించారు. చదివింది 4వ తరగతి యినా నాటక రంగంలో విశేషంగా రాణించారన్నారు. 40కిపైగా పుస్తకాలు రచించారన్నారు. ఈసందర్భంగా సంస్థ గౌరవాధ్యక్షుడు కే.చన్నప్ప, అధ్యక్షుడు కోటేశ్వరరావు, గౌరవ కార్యదర్శి ప్రకాశ్, కృష్ణ, చౌదరిప్రభాకర్, పొంపనగౌడ, శ్రీనివాసులు, రామచంద్ర, శేషారెడ్డి, ప్రభుదేవా, రమణప్ప భజంత్రి తదితరులు పాల్గొన్నారు.

దరూరుకు పలువురి నివాళి

బళ్లారి, మే 12 (ఆంధ్రజ్యోతి):అనంతపురం జిల్లా మాజీ ఎంపీ దరూరు పుల్లయ్య (93) సోమవారం కన్నుమూశారు. సోమవారం బళ్లారి నుంచి కంప్లి కొట్టాల వద్ద పొలం చూసి ఇంటికి వస్తుండగా నేలపై కూలిపోయారు. అక్కడ ఉన్నవారు వచ్చి చూడగా పుల్లయ్య తుదిశ్వాస విడిచినట్లు నిర్ధారించారు. ఆయన మృతికి పలువురు ప్రముఖులు నివాళి అర్పించారు. మేయర్ ముల్లంగి నందీష్‌బాబు, మాజీ బుడా అధ్యక్షుడు ముల్లంగి రవీంద్ర, బళ్లారి జిల్లా కమ్మసంఘం అధ్యక్షుడు ముండ్లూరు అనూఫ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నారా సూర్యనారాయణరెడ్డి, ముండ్లూరు దివాకర్‌బాబు, అల్లం వీరభద్రప్ప, మాజీ ఎంపీ కే.సీ కొండయ్య, బళ్లారి నగర ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి, మాజీ మేయర్ రాజేశ్వరి సుబ్బరాయుడు, కొత్తపల్లి తిమ్మరాజ, కార్పొటర్లు విక్కీ, వివేక్, రామాంజనేయులు, కమ్మసంఘ నాయకులు.. సంతాపం వ్యక్తం చేశారు.



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ప్రముఖులు



నివాళి అర్పిస్తున్న వైసీపీ నేతలు శివరామిరెడ్డి, విశ్వేశ్వర రెడ్డి

పీడీ హళ్లి పోలీసు స్టేషన్‌లో శాంతిసభ



మాట్లాడుతున్న ఎస్ఐ నాగభూషణ్

బళ్లారిరూరల్, మే 12(ఆంధ్రజ్యోతి): తాలుకాలోని పరమదేవనహళ్లి పోలీస్ స్టేషన్‌లో ఎస్సీ, ఎస్టీ శాంతి సభను ఎస్ఐ నాగభూషణ్ నేతృత్వంలో సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ నాగభూషణ్ మాట్లాడుతూ పిల్లలకు చక్కగా చదివించి సంస్కృతి, సంప్రదాయాలు నేర్పాలన్నారు. గ్రామాల్లో కులమత ఘర్షణలు తల్తెకుండా చూడాలన్నారు. గ్రామాల్లో చిన్న చిన్న సమస్యలను స్థానికంగానే పరిష్కరించుకోవాలన్నారు. గ్రామాల సమస్యలను అడిగి తెలుసు కున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ అధ్యక్షులు లక్ష్మీ, శివరాజు, ప్రభాకర్, బ్రహ్మానందం, వీరేశేఖర్, రఘు, మంజునాథ్ పలు గ్రామాల యువకులు తదితరులు పాల్గొన్నారు.

రైళ్లలో మహిళలకు భద్రత కల్పించాలి



మహిళలపై దాడి చేస్తున్న దుండగులు (ఫైల్)

కంప్లి, మే 12(ఆంధ్రజ్యోతి): రైళ్లల్లో మహిళలకు రక్షణ కల్పించాలని పలువురు కోరుతున్నారు. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ మీదుగా తిరిగే అమరావతి ఎక్స్‌ప్రెస్‌లో పోలీసు సిబ్బంది ఎక్కువగా పెంచాలని ప్రయాణికులు తెలుపుతున్నారు. ఒంటరిగా మహిళలు వెళ్లేందుకు భయాందోళన చెందుతున్నారు. రెండు రోజుల క్రి తం ట్రైన్ నెంబర్ 17225 ఆంధ్ర నుంచి కర్ణాటక వస్తున్న ఈ రైలులో నలుగురు వ్యక్తులు మహిళలపై ఘర్షణకు దిగారు. ట్రైన్‌లో చివరన గార్డు పక్కన వుండే మహిళల భోగిలో ప్రయాణం చేస్తుండగా తమకు కావాల్సిన మహిళలకు కూర్చోవడానికి స్థలం ఇవ్వలేదని వాగ్వాదానికి దిగారు. ఈ విషయంపై గార్డుకు రైల్వే శాఖ పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వారు వాపోతున్నారు. రైళ్లల్లో మహిళలకు భద్రత పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని గాయపడిన శిరీష, వీరేష్, నాగలక్ష్మీ వాపోయారు. చివరి స్టేషన్లో బళ్లారిలో రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశామని, అయితే ఆ ఘటన ఆంధ్రలో జరిగింది అక్కడే ఫిర్యాదు చేయాలని పోలీసులు తెలిపినట్లు వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇకపై ఇలాంటి దారుణాలు జరగకుండా చూడాలని వారు కోరారు.

వంతెనపైకి దూసుకెళ్లిన వాహనం

బళ్లారిరూరల్, మే 12 (ఆంధ్రజ్యోతి) : తాలుకాలోని పరమదేవనహళ్లి వద్ద సోమవారం మధ్యాహ్నం హగరి వైపు నుంచి బళ్లారి వెళ్తున్న తూఫాన్ వాహనం అదుపు తప్పి బ్రిడ్జిని ఢీ కొంది. వేదవతి వంతెనపైన ప్రయాణిస్తుండగా స్టీరింగ్ రాడ్ మరమ్మతు కారణంగా బ్రిడ్జిని బలంగా ఢీ కొంది. ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయట పడడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.



బ్రిడ్జిని ఢీ కొన్న వాహనం

నీటి సమస్య తలెత్తకుండా చూడండి

- అధికారులకు ఎమ్మెల్యే అన్నపూర్ణ సూచన



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అన్నపూర్ణ

కంప్లి, మే 12 (ఆంధ్రజ్యోతి): కుడితిని పట్టణంలోని 19వ వార్డులో తాగునీటి వీధి దీపాలు, మురికి కాలువలు పరిశుభ్రం, మౌలిక సాకర్యాల కల్పనపై అధికారులు దృష్టి పెట్టాలని సండూరు ఎమ్మెల్యే అన్నపూర్ణ సూచించారు. సోమవారం కుడితిని పట్టణంలో పట్టణ పంచాయతీ ప్రాంగణంలో కౌన్సిలర్లు పట్టణ ప్రజలు సమస్యలపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలోని 9, 10, 17,18, 19 వార్డులతో సహా వివిధ వార్డుల్లో తగినంత నీటి సరఫరా లేదన్నారు. కొన్ని వార్డుల్లోని స్వచ్ఛమైన తాగునీటి ఆర్‌వో ప్లాంట్ శిథిలావస్థకు చేరుకున్నాయి. వెంటనే మరమ్మత్తులు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. అధికారుల మధ్య సమన్వయ లోపం వల్ల పట్టణంలో అనేక సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. అందువల్ల తాగునీటి, వీధిదీపాలు వంటి వివిధ సమస్యలను పరిష్కరించడానికి అధికారులు చురుగ్గా పనిచేయాలని సూచించారు. డిగ్రీలు, డిప్లమోలు, స్టేడియం నిర్మాణం వంటి డిమాండ్లను ఎంపీల దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇక్కడ జరిగిన సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు ప్రజలకు తాగునీటి సమస్య, వీధి దీపాలు లేకపోవడం ముఖ్య అధికారి నిర్లక్ష్యం గురించి చర్చించారు. అదేవిధంగా ఎమ్మెల్యేకు వివిధ ఫిర్యాదులను లోపాలను సమర్పించారు. ఈ సమస్యలన్నింటినీ విన్న తరువాత ఎమ్మెల్యేలు వెంటనే దృష్టిసారించి సమస్యలను పరిష్కరించాలని అధికారులకు కఠినమైన సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా పట్టణ పంచాయతీ అధ్యక్షురాలు సుజాత సత్యప్ప, స్టాండింగ్ కమిటీ అధ్యక్షులు రాజశేఖర, ఉపాధ్యక్షులు కనికేరి పంపాపతి, పట్టణ పంచాయతీ కౌన్సిలర్లు ముఖ్య కార్యదర్శి తీర్థప్రసాద్, ఏఈఈ అరుణ్ పటేల్, రాజేంద్రప్రసాద్, జేఈ శారద, జగ్గునాయక్, వీరేష్ నాయకులు పల్లెద ప్రభు, కంబెట్ రామాంజిని, చంద్రప్ప, కౌశిక్, విటోబ, హనుమంత, వినోద్, ప్రతాప్, పట్టణవాసులుఅధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

హోసూరు జోన్

తెలుగు భాషాభిమాని కృష్ణప్ప కన్నుమూత

హోసూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాషాభిమానిగా పేరొందిన రాష్ట్రేతర తెలుగు సమాఖ్య (రాతెస) దక్షిణ విభాగం ఛైర్మన్ కేఎస్ కృష్ణప్ప (67) కన్నుమూశారు. హోసూరు సమీపంలోని కురుబరపల్లి గ్రామంలోని స్వగృహంలో ఆదివారం తుదిశ్వాస వీడారు. తెలుగు భాష వికాసానికి కృషి చేయడంతో పాటు కమ్యూనిస్టు నేతగాను రాణించారు. ఆయన ఆకస్మిక మృతి పట్ల పలువురు నివాళులు అర్పించారు. సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు. ఎంపీ గోపినాథ్, ఎమ్మెల్యే టీ రామచంద్రన్, ఉపాధ్యాయులు, రిటైర్డు ఉపాధ్యాయులు సంతాపం ప్రకటించారు. సమాఖ్య తరపున సీతారామయ్య, వెంకటేశ్, జయరాం, రామరెడ్డి, ఆనందరాజ్, రామచంద్రన్ తదితరులు శ్రద్ధాంజలి ఘటించారు.



కృష్ణప్ప (ఫైల్)

నర్సుల సేవలు వెలకట్టలేనివి

హోసూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): రోగులు త్వరగా కోలుకోవడానికి నర్సుల సేవలు ప్రశంసనీయమని వక్తలు పేర్కొన్నారు. ప్రపంచ నర్సుల దినోత్సవాన్ని పురస్కరించుకుని హోసూరు ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లక్ష్మీ నర్సులను అభినందించారు. నర్సులను శాలువాలు, బహుమతులతో సత్కరించారు. హోసూరు మాగ్నం అరిమసంఘం అధ్యక్షుడు మహేంద్రన్, కార్యదర్శి కన్నన్, సేవా పథకం కార్యదర్శి రవిశంకర్, కోశాధికారి మాదేశ్‌కుమార్ పాల్గొన్నారు.



నర్సులను సత్కరిస్తున్న డాక్టర్ లక్ష్మి

ఘనంగా సంతాన వేణుగోపాలస్వామి రథోత్సవం

హోసూరు, మే 12(ఆంధ్రజ్యోతి): డెంకణీకోట తాలూకా తళి గ్రామంలో కొలువైన రుక్మిణి సత్యభామ సమేత సంతాన వేణుగోపాలస్వామి రథోత్సవం వైభవంగా జరిగింది. వైశాఖ పున్నమిని పురస్కరించుకుని సోమవారం విశేష పూజలు నిర్వహించారు. ఏప్రిల్ 24న ప్రారంభమైన ఉత్సవాలు ఈనెల 15న ఉత్సవాలు ముగియనున్నాయి. మంగళవారం డోలోత్సవం, బుధవారం వసంతోత్సవం, గురువారం శయనోత్సవం జరగనున్నాయి. సోమవారం రథోత్సవంలో చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

పర్యావరణంపై అవగాహన

హోసూరు, మే 12(ఆంధ్రజ్యోతి): ఆదియమాన్ వ్యవసాయ కళాశాల చివరి సంవత్సరం విద్యార్థులచే మల్లప్పడి గ్రామంలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులలో పర్యావరణ పరిరక్షణ గురించి అవగాహన కల్పించారు. ఫైనలియర్ విద్యార్థులు జిల్లా వ్యాప్తంగా పర్యటిస్తూ చైతన్యం కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా బర్గూరు సమీపంలోని మల్లప్పడి గ్రామంలో ఎక్కువ దిగుబడి పొందడానికి పాటించాల్సిన పద్ధతులను, పంట తెగుళ్లనుంచి ఎలా రక్షించుకోవాలని రైతులకు వివరించారు. ఇదే సందర్భంగా స్వచ్ఛతా పనుల్లో నిరంతరం నిమగ్నమయ్యే పారిశుధ్య కార్మికులకు రక్షణా చర్యలపై అవగాహన కల్పిస్తూ గ్లవ్స్, ఫేస్ మాస్కులు అందచేశారు.



పారిశుధ్య కార్మికులతో విద్యార్థులు